వుదయం

ప్రత్యామ్నాయ పంటల సాగుతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

- మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక
- రైతులకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం: కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ జిల్లా, వుదయం ప్రతినిధి

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించి వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించు కుంటూ పంటల దిగుబడిని పెంచుకోవాలని, రైతులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. శనివారం నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన (అగ్రిషో)ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన 120 స్టాళ్లను సందర్శించి వ్యవసాయ రంగానికి సంబంధించిన ఆధునిక పనిముట్లు, యంత్రాలు, నూతన సాంకేతిక పద్ధతులు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, రైతులు వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. నేలను నమ్ముకొని జీవించే రైతులు భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేయాలని అన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, చలికాలంలోనూ వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. సంప్రదాయ పద్ధతుల్లోనే పంటలు సాగు చేస్తే పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి ఉండకపోవచ్చని హెచ్చరించారు. ఏ నేలలో ఏ పంట పండుతుంది? ప్రస్తుత వాతావరణానికి అనుకూలమైన పంటలు ఏమిటి? అనే అంశాలను ముందుగానే పరిశీలించి సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 14 వేల ఎకరాల్లో నూనెగింజల పంటల సాగు చేపట్టామని, మరింత మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందుకు రావాలని కోరారు. వ్యక్తిగతంగా సాగు చేయడం సాధ్యం కాని రైతులు రైతు సంఘాలు, గ్రూపులుగా ఏర్పడి సమష్టి సాగు చేపడితే అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందని సూచించారు. రైతులు పండించిన పంటలను కేవలం ముడి ఉత్పత్తుల రూపంలో విక్రయించకుండా, వాటిని ప్రాసెసింగ్ చేసి మార్కెట్‌లో విక్రయించే దిశగా ఆలోచించాలని కలెక్టర్ సూచించారు.

నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ పట్టణంలో వ్యవసాయ ప్రదర్శన నిర్వహించడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతు పండిస్తేనే ప్రజలకు అన్నం లభిస్తుందని, రైతు దేశానికి వెన్నెముక అని పేర్కొన్నారు. రైతుల కోసం ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీరు అవసరమయ్యే పంటలను పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విష్ణు కృష్ణ, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నరసింహా రెడ్డి, జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుకు సీతారాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, మల్లు లక్ష్మి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, జూలకంటి రాజేందర్, ప్రమీల, స్టాళ్ల నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బైరు సైదులు గౌడ్ నియామకం

ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలుకు కృషి చేయాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ జిల్లా, వుదయం ప్రతినిధి



నల్గొండ జిల్లా ఆర్టీఐ (సమాచార హక్కు) మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నల్గొండ పట్టణానికి చెందిన బైరు సైదులు గౌడ్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా బైరు సైదులు గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం–2005 సమర్థవంతంగా అమలయ్యేలా కమిటీ సభ్యుడు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు చట్టంపై అవగాహన కల్పించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకునే పౌరులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు.


ఈ సందర్భంగా బైరు సైదులు గౌడ్ మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పన కోసం చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, ఆర్డీఓ అశోక్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ అధికారులకు, సామాన్య ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు పారదర్శక పాలన అందేలా నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, సమాచారాన్ని పొందడంలో ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

తన నియామకానికి సహకరించిన సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాచం సత్యనారాయణ, దయాకర్ రావు, మారం గోనారెడ్డి, కోటగిరి దైవాదీనం, గండమళ్ళ జయంత్, గాదె వినోద్ రెడ్డి, యర్రమాద హేమలత, బోగరి రామకృష్ణ, యాళ్ల చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, కర్నాటి యాదగిరి, కార్యదర్శి తుంగతుర్తి రామకృష్ణ, గంటేకంపు గణేష్, బీమనపల్లి నగేష్, అదిమల్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కార్యాలయంలో డీసీఎం ఓనర్లతో సమావేశం

వారి సమస్యలపై చర్చించిన చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట, నవంబర్ 14 : వుదయం ప్రతినిధి




వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో డీసీఎం ఓనర్లతో నిర్వహించిన ముఖ్య సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఎం ఓనర్లు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కొప్పుల వేణారెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించారు. ప్రజలు, వ్యాపారులు, మార్కెట్ కు అనుబంధంగా పనిచేసే ప్రతి ఒక్కరి సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. సమస్యలను విన్న వెంటనే స్పందించి పరిష్కారం చూపిన మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డికి డీసీఎం ఓనర్లు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కు వచ్చే రైతులు, వ్యాపారులు, హమాలీలు, రవాణా రంగానికి చెందిన ప్రతి ఒక్కరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ పనిచేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి యండి ఫసియొద్దీన్ ముక్రం, అసిస్టెంట్ కార్యదర్శి వెంకట్ రెడ్డి, గ్రేడ్–2 కార్యదర్శి ఉమామహేశ్వర్, ఖాసీం, డీసీఎం ఓనర్లు ఎస్ఎస్ సాజిద్ ఖాన్, రేణబోతుల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక గ్రామసభ

జగన్నాథపురం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు

మునగాల, నవంబర్ 14 (వుదయం):




మునగాల మండల పరిధిలోని జగన్నాథపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం బాలల ప్రత్యేక గ్రామసభ, బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి ఎన్. అనిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు వక్కంతుల భరత్ బాబు మాట్లాడుతూ.. గ్రామంలోని బాలలందరికీ ఎలాంటి వివక్ష లేకుండా విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణ, సమగ్ర అభివృద్ధితో పాటు గ్రామస్థాయి నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించడమే బాలల ప్రత్యేక గ్రామసభ ముఖ్య ఉద్దేశమని వివరించారు. బాలబాలికలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ కార్యదర్శి ఎన్. అనిత మాట్లాడుతూ.. బాలల సమస్యలను కేవలం వ్యక్తిగత సమస్యలుగా కాకుండా గ్రామ అభివృద్ధి, స్థానిక సుపరిపాలనలో కీలక అంశాలుగా పరిగణించాలని తెలిపారు. బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంబంధించి సమావేశంలో 16 తీర్మానాలను ఆమోదించారు. అనంతరం బాలలందరితో హక్కుల పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లం యమునా లింగరాజు, వార్డు సభ్యులు వీరబాబు, మైసమ్మ జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డి.వి. శంకరరావు స్ఫూర్తిదాయక ప్రస్థానాన్ని ప్రస్తావించాలి

- మోదీకి భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకటరావు ప్రత్యేక సిఫారసు
- 71 ఏళ్ల వయస్సులో పవర్‌లిఫ్టింగ్‌లో అడుగుపెట్టి ప్రపంచస్థాయిలో పతకాల సాధన

భద్రాచలం 14/11/26 ఈ ప్రతినిధి:




వయస్సు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, సాధించాలనే బలమైన సంకల్పం, నిరంతర సాధన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే జీవితంలో ఏ దశలోనైనా అద్భుత విజయాలను సొంతం చేసుకోవచ్చని భద్రాచలానికి చెందిన ప్రపంచ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ పతక విజేత డి.వి. శంకరరావు తన అసాధారణ క్రీడా ప్రస్థానం ద్వారా నిరూపిస్తున్నారు. సాధారణంగా ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంతి జీవితాన్ని గడపాలని భావించే వయస్సులో, 71 ఏళ్ల వయస్సులో పవర్‌లిఫ్టింగ్ వంటి కఠినమైన క్రీడలోకి అడుగుపెట్టి, జాతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు పతకాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ఆయన సాధించిన విజయాలు కేవలం వ్యక్తిగత ప్రతిభకు నిదర్శనం మాత్రమే కాకుండా, వయోవృద్ధుల్లో దాగి ఉన్న అపారమైన సామర్థ్యానికి, ఆరోగ్యంపై అవగాహనకు, పట్టుదలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో డి.వి. శంకరరావు స్ఫూర్తిదాయక క్రీడా ప్రయాణాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో భద్రాచలం శాసనసభ్యులు డా. తెల్లం వెంకటరావు గారు గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి ప్రత్యేక సిఫారసు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారం కానున్న ప్రధానమంత్రి గారి ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'మన్ కీ బాత్'లో డి.వి. శంకరరావు సాధించిన విజయాలను, ఆయన జీవిత ప్రయాణాన్ని ప్రస్తావించాలని ఎమ్మెల్యే తన లేఖలో కోరారు.

నారాయణ పాఠశాలలో ఘనంగా స్పోర్ట్స్ మీట్

కోదాడ నవంబర్ 14(వుదయం)



కోదాడ పట్టణంలోని నారాయణ పాఠశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్ (ది చాంప్స్) స్పోర్ట్స్ మీట్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హరిత రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన అనంతరం నారాయణ స్పోర్ట్స్ జెండాను ఆవిష్కరించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు శారీరక దృఢత్వం, మానసిక వికాసం, మెదడు చురుకుదనం పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ–కిడ్స్ కోఆర్డినేటర్ మహేశ్వరి, ఏఓ వీరారెడ్డి, సెగ్మెంట్ హెడ్స్ రమణయ్య,సలీమా ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు

దమ్మపేట, నవంబర్ 14, (వుదయం ప్రతినిధి):




బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారతదేశ తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దమ్మపేట పంచాయతీ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. జవహర్‌లాల్ నెహ్రూకు చిన్నపిల్లలంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయన జన్మదినమైన నవంబర్ 14వ తేదీని భారత ప్రభుత్వం బాలల దినోత్సవంగా ప్రకటించి ప్రతి సంవత్సరం నిర్వహిస్తోందని తెలిపారు. బాలలే దేశ భవిష్యత్తు అని, వారిని వ్యసనాలకు, దురలవాట్లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా బాలల భవిష్యత్తును నాశనం చేసే మద్యం, గంజాయి తదితర నిషేధిత మత్తు పదార్థాలకు చిన్నారులు, యువత దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాలకవర్గ సభ్యులు పిలుపునిచ్చారు. గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ఇప్పటికే చేసిన తీర్మానాలను కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ విషయంలో ప్రతి పాలకవర్గ సభ్యుడు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, గ్రామంలో ఎక్కడైనా నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు లేదా సరఫరా జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు. బాలలకు మత్తు పదార్థాలు అందుబాటులో లేకుండా చూడటంతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు సమష్టిగా అవగాహన కల్పించాలని కోరారు. మత్తు పదార్థాల రహిత గ్రామాన్ని నిర్మించగలిగినప్పుడే ఆరోగ్యకరమైన భావితరాలకు బాటలు వేసినవారమవుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొల్లు దుర్గారావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, పసుమర్తి కుసుమాంబ, చిన్నశెట్టి నాగలక్ష్మి, సిబ్బంది మహాదేవ సాయి, కుప్పాల విజయ్, భీమా శ్రీనివాసరావు, కాకాని గణేష్, గ్రామస్తులు చిన్నశెట్టి ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి ఐక్య పోరాటం అవసరం

- దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి
- సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ, డి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం

సూర్యాపేట అక్టోబర్ 14 వుదయం ప్రతినిధి



దళిత హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయ సాధన, సమానత్వ సమాజ నిర్మాణమే లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాలను ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాదులో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె. ఏసురత్నం తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్ లో వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలోనూ కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలు కొనసాగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు, విద్య, ఉపాధి అవకాశాలు ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలుగా దళిత హక్కుల పోరాట సమితి సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యమై సామాజిక న్యాయ ఉద్యమానికి మద్దతుగా నిలవాలని కోరారు. 29, 30 తేదీల్లో జరిగే వార్షికోత్సవాల్లో ప్రజాస్వామిక వాదులు, యువత, విద్యార్థులు, కార్మికులు, దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, డి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు కందుకూరి యాదగిరి, నాయకులు నెమ్మాది గురుస్వామి, ఉరుసు మహేష్, యాతాకుల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల మనసును ఆవిష్కరించే చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'



బాలల దినోత్సవం సందర్భంగా ప్రేక్షకుల ముందుకు.. సూర్యాపేటలో ప్రత్యేక ప్రదర్శన

సూర్యాపేట, నవంబర్ 14 : వుదయం ప్రతినిధి


పిల్లల మనస్తత్వం, చదువుల ఒత్తిడి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతలను కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ రూపొందిన హృద్యమైన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా సూర్యాపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ప్రేక్షకులు, జయంత్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. చదువుల్లో భాగంగా గణితం హోంవర్క్ చేయడానికి ఇబ్బంది పడే, కఠినంగా వ్యవహరించే ఉపాధ్యాయుడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించే జయంత్ అనే అల్లరి బాలుడి చుట్టూ కథ అల్లుకుంది. ఈ క్రమంలో అతని తాత పరిచయం చేసిన పురాతనమైన మాయా పెన్ 'జింగో పెన్' కథలో ఊహించని మలుపులకు, ఆసక్తికర సన్నివేశాలకు కారణమవుతుంది. నవ్వులు, భావోద్వేగాలు, అద్భుతమైన అనుభవాల మధ్య పిల్లల ఆలోచనలు, వారి ప్రతిభను గుర్తించే ప్రయాణంగా ఈ చిత్రం తెరకెక్కింది. నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మించిన ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన దర్శకత్వం వహించారు. మాస్టర్ జయంత్ బొలిశెట్టి ప్రధాన పాత్రలో అద్భుతంగా నటించగా, ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం చంద్రశేఖర్, పాఠశాలల కరస్పాండెంట్లు మారం లింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పులుసు వెంకటేశ్వర్లు, పగడాల ఉపేందర్‌రెడ్డి, కొండ సంతోష్, ఖమ్మంపాటి భిక్షపతి, పట్టణ పెరిక సంఘం అధ్యక్షులు పత్తిపాక వేణుధర్, సీనియర్ నాయకులు బొలిశెట్టి మధు, బాల్తు శ్రీనివాస్, దొంగరి నాగేశ్వర్రావు, పోతురాజు నర్సయ్య, సంద్యాల వినోద్, బందు వీరయ్య, సోమిశెట్టి లింగయ్య, బెక్కం వెంకటేశ్వర్లు, పత్తిపాక వెంకటేశ్వర్లు, పత్తిపాక రాధాకృష్ణ, బుస్సా వీరయ్య, నెమ్మని నాగేశ్వర్రావు, బాసాని వెంకన్న, నెమ్మని వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి ఉపేందర్, నట్టె కిరణ్, దేవరగట్ల సతీష్, నట్టె కోటేశ్వర్రావు, మార్త వెంకటేశ్వర్లు, పత్తిపాక వీరమ్మ, బందు మమత, సౌమ్యలతో పాటు అభిమానులు, ప్రేక్షకులు పాల్గొన్నారు.



తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

కల్లూరు, నవంబర్ 14:(వుదయం ప్రతినిధి)

కల్లూరు పట్టణంలోని తెలంగాణ గ్రామర్ స్కూల్ (ఈ.ఎం.)లో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ప్రిన్సిపల్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు నెహ్రూ జీవిత విశేషాలను, బాలల పట్ల ఆయన కున్న ప్రేమాభిమానాలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం అలవర్చాలని అన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




దోరకుంటలో 59 మందికి నూతన పింఛన్లు

కోదాడ నవంబర్ 14 (వుదయం)

కోదాడ మండలం దోరకుంట గ్రామంలో నూతనంగా మంజూరైన 59 సామాజిక భద్రతా పింఛన్ల మంజూరు పత్రాలను సర్పంచ్ పాలకి సురేష్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులకు పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని బిజెపి రాస్తారోకో

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి, నవంబర్ 14



రైతన్న ఆ రుగాల o కష్టించి ప ండించిన ప ంట ను ప్రభుత్వం కొనుగోలు చేయాలని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ డిమాండ్ చేశారు లేకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో చిట్యాల భువనగిరి ప్రధాన రహదారిపై పార్టీ మండల శాఖ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో రైతు ధర్నా కార్యక్రమం నిర్వహించారు జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సొంత మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొబ్బరికాయలు కొట్టి రిబ్బన్లు కట్ చేయడం మాత్రమే చేశారని పాశం భాస్కర్ విమర్శించారు దీంతో పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు మధ్య దళారులకు తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని వివరించారు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కార్యదర్శి కందుల తానేష గౌడ్ ఇతర కార్యవర్గ సభ్యులు బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాదయాత్ర 51వ రోజు మల్లన్న కారును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

- రెండు కార్లు ధ్వంసం.. గాయపడిన దంపతుల పరిస్థితి విషమం
- మరో ఫార్చునర్‌లో లారీ డ్రైవర్ పరారీ

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి



బీసీ రాజ్యాధికార యాత్ర 51వ రోజు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కాన్వాయ్‌లోని కారును లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం వద్ద శుక్రవారం (నవంబర్ 13) ఈ ఘటన చోటు చేసుకుంది. ఢీకొన్న ధాటికి మల్లన్న వాడే ఫార్చునర్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. రెండు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఘటన సమయంలో మల్లన్న కార్యకర్తలతో కలిసి పాదయాత్రలో ఉండటంతో ఆయనకు గాయాలు కాలేదు. మల్లన్నను లక్ష్యంగా చేసుకునే లారీతో కారును ఢీకొట్టించారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఆరోపించింది.

ఢీకొట్టిన వెంటనే మరో ఫార్చునర్‌లో వెళ్లిపోయాడని ఆరోపణ

గురువారం రాత్రి మోత్కూరులో సభ ముగిసిన అనంతరం శుక్రవారం ఉదయం పాదయాత్ర అనాజిపురం మీదుగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వైపు సాగింది. ఘటనకు కొద్దిసేపటి ముందు పాదయాత్ర బృందానికి, మల్లన్న కారుకు మధ్య ఓ బస్సు వచ్చిందని, అది వెళ్లగానే లారీ వెనుక నుంచి కారును ఢీకొట్టిందని యాత్ర వర్గాలు చెబుతున్నాయి. ఢీకొనడానికి ముందు లారీ డ్రైవర్ బ్రేకులు వేసినట్టు కనిపించలేదని, ఘటన జరిగిన వెంటనే అతడు మరో ఫార్చునర్‌లో అక్కడి నుంచి వెళ్లిపోయాడని అనుమానం వ్యక్తం చేశాయి. యాత్రను అడ్డుకునేందుకు మల్లన్నను లక్ష్యంగా చేసుకున్నారని టీఆర్పీ ఆరోపించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢీకొట్టడం ఉద్దేశపూర్వకమా, మరో వాహనం అక్కడికి వచ్చిందా అన్న అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.


తిరుమలగిరి దంపతుల పరిస్థితి విషమం

ఎదురుగా వచ్చిన కారులో ప్రయాణిస్తున్న తిరుమలగిరికి చెందిన మేడబోయిన శ్రీనాథ్, ఆయన భార్య చందన తీవ్రంగా గాయపడ్డారు. వారిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. దంపతుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ కారు డ్రైవర్ సురేశ్‌తో పాటు మల్లన్న కారులో ఉన్న బన్నీ, రంగన్న కూడా గాయపడ్డారు.

పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధరావత్ రవి ఎన్నిక

జిల్లా కార్యవర్గ సభ్యునిగా పొన్నం బ్రహ్మం ఏకగ్రీవ ఎంపిక

మునగాల, నవంబర్ 14 (వుదయం):




నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) సూర్యాపేట జిల్లా 9వ మహాసభలో కొక్కిరేణి గ్రామానికి చెందిన ధరావత్ రవి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, పొన్నం బ్రహ్మం జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ధరావత్ రవి, పొన్నం బ్రహ్మం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, వైద్యరంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత ఐక్యంగా పోరాడాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువత సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమిస్తామని వారు తెలిపారు.

సీతారామ భూ నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాను

మంత్రి తుమ్మల హామీ


దమ్మపేట నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):



సీతారామ ఎత్తిపోతల పథకం కోసం భూములు ఇచ్చి నష్టపోయిన నిర్వాసితుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో శనివారం ఉదయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసితులు కలిశారు. మండలంలోని మొండి వర్రె 10వ ప్యాకేజీ కింద భూములు కోల్పోయిన బాధిత గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలను మంత్రికి ఏకరువు పెట్టారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ విలువైన భూములను త్యాగం చేశామని, అయితే భూసేకరణ, పరిహారం, పునరావాస ప్యాకేజీలకు సంబంధించి ఇంకా పలు సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. . మొండి వర్రె 10వ ప్యాకేజీ భూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సాంకేతిక, పరిహార సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ప్రత్యేకంగా మాట్లాడతానని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా చర్యలు తీసుకుని, సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యలకు ముగింపు పలికేలా కృషి చేస్తానని మంత్రి వారికి స్పష్టమైన హామీ ఇచ్చారు. మంత్రి సానుకూల స్పందనతో భూ నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండలానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు కాసాని నాగప్రసాద్, దొడ్డ ప్రసాద్ పాల్గొన్నారు.

యర్రబోయినపల్లిలో ఘనంగా బాలల దినోత్సవం

కల్లూరు నవంబర్ 14(వుదయం ప్రతినిధి):



బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. సాధారణంగా తరగతి గదిలో ఉపాధ్యాయుల నుంచి పాఠాలు నేర్చుకునే విద్యార్థులు.. ఈసారి ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల స్థానంలో నిలబడి పాఠాలు చెప్పడం, ప్రశ్నలు అడగడం, సమాధానాలు రాబట్టడం వంటి కార్యక్రమాలతో తరగతి గదుల్లో సరికొత్త సందడి నెలకొంది.

విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధిస్తున్న తీరును అసలైన ఉపాధ్యాయులు ఆసక్తిగా పరిశీలించారు. చిన్నారుల్లో దాగి ఉన్న బోధనా నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను చూసి అభినందించారు. కొందరు విద్యార్థులు ఉపాధ్యాయుల మాదిరిగా బోర్డుపై పాఠ్యాంశాలను రాస్తూ, తోటి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాలల దినోత్సవం అంటే కేవలం ఆటపాటలు, వేడుకలకే పరిమితం కాకుండా.. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసి, వారి ఆలోచనలకు వేదిక కల్పించడమేనని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ప్రతి చిన్నారిలోనూ ఒక ఉపాధ్యాయుడు, నాయకుడు, సృజనశీలి దాగి ఉంటాడనే విషయాన్ని ఈ వినూత్న వేడుకలు మరోసారి నిరూపించాయి.

సింగిల్ వెంట్‌తో ఇబ్బందులు.. డబుల్ వెంట్ ఏర్పాటు చేయాలి

- రూ.3.50 కోట్లతో తయారు చేసిన బాక్సులు నాలుగేళ్లుగా నిరుపయోగం
- పనులు చేపట్టకుంటే ప్రజా ఆందోళన తప్పదు: మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్గొండ జిల్లా నవంబర్ 14 వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో హైదరాబాద్ రహదారిపై రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంలో డబుల్ వెంట్ ఏర్పాటు చేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే ఇంజినీరింగ్ అధికారులను కలిసి సమస్యలను వివరించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హైదరాబాద్ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించే క్రమంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు సింగిల్ వెంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలిపారు. అయితే ఈ మార్గంలో నిత్యం భారీగా వాహనాల రాకపోకలు ఉంటాయని, సింగిల్ వెంట్ వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేసి పనులను నిలిపివేయించినట్లు చెప్పారు. అనంతరం రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించి డబుల్ వెంట్ అవసరాన్ని గుర్తించి అంగీకరించారని వివరించారు. డబుల్ వెంట్ నిర్మాణానికి నిధుల కొరత ఉందని అధికారులు చెప్పడంతో, అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో అప్పటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో మాట్లాడి రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆ నిధులతో డబుల్ వెంట్‌కు అవసరమైన బాక్సులను తయారు చేసినప్పటికీ, నాలుగేళ్లుగా వాటిని అమర్చకుండా నిరుపయోగంగా ఉంచడం విచారకరమన్నారు. ప్రస్తుతం రైల్వే లైన్ డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో మళ్లీ సింగిల్ వెంట్‌తోనే రహదారి నిర్మించే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాధనంతో తయారు చేసిన బాక్సులను వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చి డబుల్ వెంట్ అండర్ బ్రిడ్జిని నిర్మించాలని అధికారులను కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా పనులు చేపడితే ప్రజా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, రేగట్టె మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి



జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు

ఖమ్మం వుదయం బ్యూరో నవంబర్ 14

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (TGO) ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 12-11-2026న సాయంత్రం 5.30 గంటలకు ఖమ్మంలోని టీజీవో భవన్‌లో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించబడింది. జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి సమావేశానికి సంబంధించిన అంశాలను వివరించి, సంఘం భవిష్యత్ కార్యాచరణపై చర్చను కొనసాగించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన లక్ష్యమని, గెజిటెడ్ అధికారుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగులందరూ సంఘంలో భాగస్వాములై ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతం, సభ్యత్వ నమోదు విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. రాష్ట్ర కార్యవర్గానికి ఖమ్మం నుండి కనపర్తి వెంకటేశ్వర్లు, టీజీవో సంఘం నీకి ఇప్పటి వరకు ట్రెజరర్ గా ఉన్న సూరంపల్లి రాంబాబు నీ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యవర్గంలోకి ప్రతిపాదించడం జరిగింది.

జిల్లా కోశాధికారిగా గంగవరపు నరేందర్ ని సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

జిల్లా కార్యవర్గంలో కీ ఉపాధ్యక్షులుగా

– కొత్త రాజు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, తెళ్లూరి శ్రీనివాసరావు ఈవో ఎస్సీ కార్పొరేషన్,

గుగులోతు మోతిలాల్ డి ఈ రిగేషన్,

జాయింట్ సెక్రటరీలుగా ఇంటూరి భాస్కర్ AO

తమ్మిశెట్టి శ్రీనివాస్ Jl

ఇంజమ్ కృష్ణార్జునరావ్ JL

నాగులపాటి శంకర్ డీఈవో, అల్లు విజయ్ జూనియర్ లెక్చరర్,

, టి భరత్ కుమార్ డి ఈ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్,

శ్రీమతి.జి జ్యోతి జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్,

ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎం ఫిరంగి డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్, రామిశెట్టి శ్రీనివాస్ ఏ ఈ ఆర్ అండ్ బి, శ్రీనివాసరావు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్,

పబ్లిసిటీ సెక్రటరీగా

ఎన్ మాధవి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, వి వెంకటేశ్వర్లు కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్,

స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ గా అబ్దుల్ సమద్ ఏ ఈఈ,

కే. కరుణాకర్ డిప్యూటీ తాసిల్దార్ జిల్లా EC మెంబెర్ గా

జిల్లా కమిటీలకు ఎన్నికైనారు.

ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారం, పదోన్నతులు, బదిలీలు, ఆర్థిక ప్రయోజనాల సాధన వంటి అంశాల్లో సంఘం క్రియాశీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర సంఘాల మధ్య సమన్వయంతో పనిచేస్తూ గెజిటెడ్ అధికారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ ఫోరమ్స్ అధ్యక్ష, కార్యదర్శులు, హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తహసిల్దార్ మాణిక్ రావు

సత్తుపల్లి నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వేంసూర్ తాసిల్దార్ మాణిక్ రావు తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత భీమా రక్షణ కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. కుల, మత, ఆదాయ భేదాలకు అతీతంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత భీమా భద్రత అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. ఈ నేపథ్యంలో వేంసూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన కుటుంబాల వివరాలను పక్కాగా సేకరించాలని సంబంధిత అధికారులకు. ముఖ్యంగా 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబ సంపాదన సభ్యుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, నామిని పేరు, నానితో సంబంధం, ఆధార్ వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. కుటుంబ పెద్ద తమ కుటుంబానికి సంబంధించిన ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులను నామినీలుగా ప్రతిపాదించుకునే అవకాశం ఉందని, ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలు ఉంటే వారికి కేటాయించే వాటా వివరాలను కూడా నమోదు చేయవచ్చని తెలిపారు. నవంబర్ 18న మండలంలోని అన్ని గ్రామాల్లో టాంటాం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు పథకంపై అవగాహన కల్పించాలని, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసే అర్హులైన ప్రతి కుటుంబం వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎండి ఫక్రుద్దీన్ రంగారెడ్డి చక్రధర్ రావు వంట్లా రమేష్ ఆంధ్రయ్య మండల తాసిల్దార్ మాణిక్ రావు మండల పంచాయతీ అధికారి కావ్య పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ దినేష్ వేణు వెంకట రామకృష్ణ రాగం దివ్య స్వాతి సునీత పుల్లారావు చైతన్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు!



నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు – సెక్టార్ సూపర్వైజర్ సుజాత

కల్లూరు, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

చంద్రుపట్ల సెక్టార్ పరిధిలోని వాత్యా నాయక్ తండ అంగన్వాడీ కేంద్రంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ.. బాలలకు చిన్నతనం నుంచే మంచి నడవడిక, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైతిక విలువలు అందించాలని అన్నారు. భావి భారత పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.కార్యక్రమంలో యూపీఎస్ హెచ్ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయులు రాంబాబు, ఆదినారాయణ స్వామి, సక్కుబాయి, అంగన్వాడీ టీచర్ రాధ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

రికవరీ ఏజెంట్ల వేధింపులపై పోలీసులు చర్య తీసుకోవాల్సిందే

వుదయం ప్రతినిధి నిడమనూరు, నవంబర్ 14:



లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపుల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రుణగ్రహీతలను బెదిరించి వసూళ్లు చేసే విధానాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. ఖమ్మంకు చెందిన ఓ రుణగ్రహీత Ambit Finvest నుండి రూ. 15.45 లక్షలు లోన్ తీసుకున్నారు. బకాయిల కోసం లెండర్ చట్టబద్ధంగా వసూలు చేయకుండా రికవరీ ఏజెంట్లను పంపి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణ. దీనిపై బాధితుడు 23.06.2026న ఖమ్మం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఎలాంటి చర్య తీసుకోలేదు. దీంతో బాధితుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన గౌరవ న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ గారు, ఫిర్యాదుపై వెంటనే చర్య తీసుకోవాలని, లెండర్‌కు నోటీసు జారీ చేయాలని పోలీసులను ఆదేశించారు. అంతేకాకుండా RBI సర్క్యులర్ 12.08.2022 ప్రకారం రికవరీ ఏజెంట్ల నిబంధనలు పాటించారో లేదో విచారణ జరపాలని స్పష్టం చేశారు. రికవరీ ఏజెంట్లు వేధించినా, బెదిరించినా పోలీసులు "ఇది సివిల్ మేటర్" అని తప్పించుకోలేరు. RBI నిబంధనల ప్రకారం విచారణ చేసి చర్య తీసుకోవాల్సిందే. పోలీస్ స్టేషన్‌లో చర్య తీసుకోకపోతే ఈ తీర్పును చూపించి న్యాయం పొందవచ్చు.

క్రీడ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



తిరుమలాపురం,నవంబర్ 14: (వుదయం ప్రతినిధి)

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం గ్రామంలో క్రీడ్ మినిస్ట్రీస్ ద్వారా నిర్వహించబడుతున్న ట్యూషన్ సెంటర్‌లో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను అత్యంత ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు.క్రీడ్ మినిస్ట్రీస్ సంబంధికులు కాపుదాసు రమేష్ బాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో విజేత సాధించిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాపుదాసు రమేష్ బాబు మాట్లాడుతూ.. క్రీడ్ మినిస్ట్రీస్ కేవలం విద్యార్థుల విద్యాభివృద్ధి మాత్రమే కాకుండా, సమాజంలో కుటుంబ సంబంధాల బలోపేతం కొరకు కూడా నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తిరుమలాపురం ఎంపీటీసీ గోపె కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పిల్లలు విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడ్ మినిస్ట్రీస్ వారు గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కాపుదాసు దుర్గారావు, అందుగుల లక్ష్మణరావు, సెట్టిమా ల క్రిష్టంరాజు, అందుగుల సత్యనారాయణ, కొనాల మంగరావు తదితరులు పాల్గొన్నారు. వీరంతా చిన్నారులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల ద్వారా గ్రామంలో పండగ వాతావరణం నెలకొనగా,ట్యూషన్ సెంటర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్వీ నేత నాగార్జున విమర్శలు

నల్గొండ జిల్లా, వుదయం ప్రతినిధి



నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చిన తర్వాతే రాహుల్ గాంధీ ఢిల్లీకి వెళ్లాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగులను మోసం చేయడమే రాహుల్ గాంధీ మాట మీద నిలబడటమా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ.. భారత్ సమ్మిట్ పేరుతో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ రాహుల్ గాంధీని హైదరాబాద్‌కు తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. 2023 ఎన్నికల సమయంలో చిక్కడపల్లి, అశోక్‌నగర్‌లో జరిగిన సభల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాహుల్ గాంధీ నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీల అమలుపై ప్రశ్నించిన నిరుద్యోగులపై లాఠీచార్జి చేయడంతో పాటు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని తెలంగాణకు వచ్చారని ప్రశ్నించారు. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాంగ్రెస్ సమ్మిట్‌లు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మాత్రం చెల్లించడం లేదని విమర్శించారు. ప్రజాధనాన్ని సమ్మిట్‌ల కోసం ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రికి విద్యార్థుల బకాయిలు చెల్లించేందుకు మనసు రావడం లేదని అన్నారు. ఇప్పటికైనా రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ పాలనను గాడిలో పెట్టాలని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దిశానిర్దేశం చేసి వెళ్లాలని నాగార్జున సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి చల్లా కోటేష్ యాదవ్, నాయకులు కోట్ల అశోక్ రెడ్డి, కొండేటి మురళి, కన్నెబోయిన వంశీ, కాడింగు శ్రీకాంత్, ప్రశాంత్, వెంకన్న, మనోజ్ కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలలతోనే దేశ భవిష్యత్తు



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్

దమ్మపేట, నవంబర్ 14, (వుదయం ప్రతినిధి):

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దమ్మపేట మండల కేంద్రంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశ తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పలకలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ శ్రేణులు పిట్టల శ్రీనివాసరావు, అన్నవరపు నాగేంద్రరావు, ఉపాధ్యాయురాలు నాగమణి, అంగన్‌వాడీ టీచర్ గోళ్ళ సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.

16న తెరుచుకోనున్న శబరిమల ఆలయం

చిలుకూరు నవంబర్ 14:(వుదయం)



రాబోయే మండల–మకరవిళక్కు సీజన్‌లో తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి శబరిమలలో యాత్రికులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె.జయకుమార్ తెలిపారు. శబరిమల ఆలయం నవంబర్ 16న సాయంత్రం 4 గంటలకు తెరుచుకుంటుంది. అన్ని ప్రధాన సివిల్ పనులు పూర్తయ్యాయని , కేవలం కొన్ని చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని జయకుమార్ తెలిపారు. యాత్రికులకు విశ్రాంతి అందించేందుకు ట్రెక్కింగ్ మార్గంలో పలుచోట్ల స్టెయిన్లెస్ స్టీల్ సీటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. నీలక్కల్లో, సుమారు 6,000 మందికి వసతి కల్పించగల జర్మన్ టెంట్ లోపల కూలర్లను ఏర్పాటు చేయనున్నారు. అరవణ ప్రసాదం పంపిణీ కోసం అదనపు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. అదనంగా ఐదు అరవాణ కౌంటర్లకు మంజూరు చేయడంతో, మొత్తం పంపిణీ కౌంటర్ల సంఖ్య 22కు చేరింది. వీటిలో 19 కౌంటర్లను ధనలక్ష్మి బ్యాంక్ , మూడింటిని సౌత్ ఇండియన్ బ్యాంక్ నిర్వహిస్తాయి. సౌత్ ఇండియన్ బ్యాంక్ నిర్వహించే ఐదు అరవణ కియోస్క్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు.

ప్రతి కుటుంబం ఇందిరమ్మ జీవిత బీమా పథకంలో నమోదు చేసుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత

మధిర, నవంబర్ 14, వుదయం, ప్రతినిధి:



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో మధిర పట్టణంలోని ప్రతి కుటుంబం తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పిలుపునిచ్చారు.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ పథకం నమోదు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించనున్నారని ఆమె తెలిపారు.ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తూ దేశంలోనే ఈ విధానాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించబోతోందని అన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి అకాల మరణం చెందితే ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోకూడదనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కొనియాడారు. పట్టణంలోని ఈనెల 17, 18,తేదీల్లో ప్రతి వార్డులో వార్డు కౌన్సిలర్,కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,మున్సిపల్ అధికారులతో కలిసి వారు వారి వార్డుల్లో బాధ్యత తీసుకొని, టమకాలు వేయించి, విస్తృత ప్రచారం చేసి సమన్వయంతో పనిచేస్తూ ప్రతి కుటుంబాన్ని ఈ జీవిత బీమా పథకంలో చేర్చాలని కోరారు.మధిర పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని కోరారు.

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి

చింతకాని, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):



భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర సమరయోధులు జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్, మత్కేపల్లి ఏఎంసీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగున్నర లక్షల మంది వితంతు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు సామాజిక పింఛన్లను మంజూరు చేసిందని తెలియజేశారు. ఈ నెల 19వ తారీకు శ్రీమతి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రతి కుటుంబానికి ఇందిరా జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో , మండల నాయకులు కూరపాటి కిషోర్, బందెల నాగార్జున, సట్టు వెంకటేశ్వర్లు, ఇనుకుల్ల నాగ సూరారెడ్డి, ఆలస్యం బసవయ్య, ఎస్.కె కాసిం, పర్సగాని సతీష్, లింగం రాంబాబు, యడ్లపల్లి శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్లరేపాకలో ఫామ్ పాండ్ నిర్మాణ పనులు ప్రారంభం

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని రెడ్ల రేపాక గ్రామంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే దిశగా, ఫామ్ పండ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి రైతు కందుల నరసింహ భూమిలో వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ పథకం కింద పనులకు సర్పంచ్ దేశ బోయిన బాలస్వామి యాదవ్ శ్రీకారం చుట్టారు ఫామ్ ఫండ్ వల్ల వర్షపు నీరు భూమిలోనే నిలువ చేసుకొని పంటలకు, అవసరమైన సమయంలో సాగునీటిగా, వినియోగించుకోవచ్చని తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామ పలువురు రైతులు పాల్గొన్నారు.

తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడు మృతి



యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి

తాటి చెట్టును పైనుండి ప్రమాదవశాత్తు జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఫకీర్ గూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఫకీర్ గూడెం గ్రామానికి చెందిన బెజ్జనబోయిన నాగయ్య (52) శుక్రవారం సాయంత్రం సమయంలో రోజు మాదిరిగానే తాటి చెట్టు ఎక్కడానికి వెళ్ళాడు. గ్రామ శివారులో ఉన్న తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో ఫోను కూడా ఎత్తడం లేదని వెతుక్కుంటూ తాటిచెట్టు వద్దకు వెళ్లారు. అప్పటికే తీవ్ర గాయాలైన నాగయ్య మృతి చెంది ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బొమ్మలరామారం ఎస్సై శ్రీశైలం దర్యాప్తు చేస్తున్నారు.

రైతు, కార్మిక సమస్యలపై ఐక్య పోరాటం చేయాలి

యల్క సోమయ్య గౌడ్

మునగాల, నవంబర్ 14 (వుదయం):



నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మునగాల మండలం నేలమర్రి గ్రామంలో సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్ మాట్లాడుతూ.. నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు సూర్యాపేట జిల్లా నుంచి వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బచ్చలకూర స్వరాజ్యం, కోల ఆంజనేయులు, షేక్ దస్తగిరి, అల్లి నాగరాజు, కోలా ఉపేందర్, బచ్చలకూర రమణయ్య, బచ్చలకూర సైదులు తదితరులు పాల్గొన్నారు.

వేంసూర్ లో ఘనంగా పండిట్ జవహర్లాల్ నెహ్రూ 137వ జయంతి వేడుకలు



సత్తుపల్లి నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాలతో శనివారం మాజీ ప్రధాని భారతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 137వ జయంతి వేడుకలు ఘనంగా వేంసూరు మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వేంసూరు లోఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి వేంసూరు సర్పంచ్ ఫక్రుద్దీన్ ఏఎంసి వైస్ చైర్మన్ వంట్లా కృష్ణార్జునరావు సర్పంచ్ రంగారెడ్డి గ్రామ శాఖ అధ్యక్షుడు నరసింహారావు మండల మహిళా అధ్యక్షురాలు పిల్లి వెంకటరమణ లిఫ్ట్ చైర్మన్ ఇబ్రహీం ఏఎంసీ డైరెక్టర్ ఇబ్రహీం అక్బర్ లాజర్ కిసాన్ సెల్ కార్యదర్శి పుల్లారావు జగన్మోహన్ రెడ్డి వేంసూరు వార్డు నెంబర్లు మాజీ వార్డు నెంబర్లు చెన్నారావు పుల్లారెడ్డి సాంబారు కృష్ణ చల్లా భాస్కర్ రెడ్డి కేశవరెడ్డి నక్కా శ్యామ్ మాజీ ఎంపీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు

చిలుకూరు నవంబర్ 14 :(వుదయం)



మండల పరిధిలోని చెన్నారిగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో, గ్రామ పరిపాలన అధికారి, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులతో కలిసి వేడుకల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా, విద్యార్థులతో ముచ్చటించి, బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు.

చెన్నారిగూడెంలో చేయూత పింఛన్లు పంపిణీ

మండల పార్టీ కార్యదర్శి పిండ్రాతి హనుమంతరావు

చిలుకూరు నవంబర్ 14:(వుదయం)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ చేయూత పింఛన్లు అందజేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిండ్రాంతి హనుమంతరావు అన్నారు. శనివారం మండలంలోని చెన్నారిగూడెం గ్రామంలో వికలాంగులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు మంజూరైన పెన్షన్ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, కార్యదర్శి రామారావు,గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు ఓబ్బయ్య, కొవ్వూరు వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు పుట్టపాక వెంకయ్య, కామతం నాగరాజు, సురపల్లి నాగరాజు, పెన్షన్ లబ్ధిదారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం

యాదాద్రి భువనగిరి, వుదయం ప్రతినిధి



జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు మరియు కార్యదర్శి సూచనల మేరకు ఈరోజు బాలల దినోత్సవం సందర్భంగ రాయిగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ సహాయ న్యాయవాదులు ఎన్. రాజశేఖర్, సి. హెచ్. సరిత విద్యార్థిని విద్యార్థులకు బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు న్యాయ సహాయం, 15100 టోల్ ఫ్రీ నెంబర్అం శాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యారాలు అండాళు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతగిరిలో కొత్త పింఛన్లు మంజూరు



అనంతగిరి, నవంబర్ 14 వుదయం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రధాన లక్ష్యమని అనంతగిరి గ్రామ సర్పంచ్ నకిరేకంటి భద్రమ్మ అన్నారు. శనివారం అనంతగిరి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, కొత్తగా మంజూరైన 33 పింఛన్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ భద్రమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేగ కొండయ్య మాట్లాడుతూ తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వారికి పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతగిరి గ్రామానికి 33 పెన్షన్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి వాసు, గ్రామ ఉపసర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, నూతన పింఛన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చేయూత పింఛనులతో పేదలకు ఆత్మగౌరవం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, వుదయం బ్యూరో నవంబర్ - 14

చేయూత పింఛనులతో పేదల జీవితాలకు ఆత్మగౌరవం కలుగుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మంత్రి, స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో లబ్ధిదారులకు నూతన చేయూత పింఛనులు, స్మార్ట్ రేషన్ కార్డులు జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల కోసం వస్తున్న అనేక దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 40 నుండి 44 లక్షల మందికి పెన్షన్లు అందుతుండగా, నేడు కొత్తగా మరో 4.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయడం ద్వారా మొత్తం లబ్ధిదారుల సంఖ్య 45 లక్షలకు చేరిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో కేవలం రూ. 200 నుండి రూ. 500 మాత్రమే పెన్షన్ ఇస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, తలసేమియా బాధితులకు నెలకు రూ. 2,016, దివ్యాంగులకు రూ. 4,016 అందిస్తోందని అన్నారు. కౌంటర్ల వద్ద ఎటువంటి తొక్కిసలాట లేకుండా అధికారుల పర్యవేక్షణలో మంజూరు పత్రాలు తీసుకోవాలని, వచ్చే నెల 1వ తారీఖు నుండి పెన్షన్ డబ్బులు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని మంత్రి తెలిపారు.

ఖమ్మం పట్టణంలో నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి, నూతన మార్కెట్, వెలుగుమట్లలో పేదల ఇళ్లు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ వంటి భారీ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి అతి త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించనున్నట్లు మంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను అధికారులు త్వరిత గతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో వెడల్పు చేసిన రోడ్లు, ఇల్లెందు రోడ్డు వంటి ప్రధాన రహదారులపై నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమణలకు గురికాకుండా మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కస్బా బజార్, చెరువు బజార్, రైల్వే స్టేషన్ రోడ్డు తరహాలో మిగిలిన రహదారుల వెడల్పుకు ప్రజలను ఒప్పించి సహకరించాలని, తద్వారా వ్యాపారస్తులకు, ప్రజానీకానికి మేలు జరుగుతుందని అన్నారు.

లక్షా 70 వేల మందికి

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు సుమారు లక్షా 70 వేల మందికి వివిధ రకాల పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. గత మూడు నాలుగు సంవత్సరాల తర్వాత ఇంత పెద్ద ఎత్తున కొత్త పెన్షన్లను మంజూరు చేయడం ఇదే మొదటిసారి అని తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే 25 వేల మంది పెన్షన్ పొందుతుండగా, తాజాగా మరో 3 వేల 244 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేసి అర్హత పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, డిఆర్డిఓ కె. శ్రీరామ్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ప్రజాప్రతినిధులు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కరోనా కష్టకాలంలో ప్రారంభమైన సేవా

61వ నెలకు చేరిన నిత్యావసర వస్తువుల వితరణ కార్యక్రమం



భద్రాచలం, 14/11/26, వుదయం ప్రతినిధి:

భద్రాచలం పట్టణంలో సేవాభావం, మానవత్వం, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా శ్రీ రామాయణ పారాయణ సేవా సమితి మరియు శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణ కుటుంబాలకు నిర్వహిస్తున్న నెలవారీ నిత్యావసర వస్తువుల వితరణ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. కరోనా మహమ్మారి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న కష్టకాలంలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే గొప్ప సంకల్పంతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం నేటికి 61వ నెలకు చేరుకోవడం విశేషం. కరోనా సమయంలో అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులతో నిత్యావసర వస్తువులు సమకూర్చుకోవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితుల్లో, అలాంటి కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలనే మానవతా దృక్పథంతో ఈ రెండు సమితులు ముందుకు వచ్చాయి. అప్పట్లో ప్రారంభించిన ఈ సేవా కార్యక్రమాన్ని కేవలం కొంతకాలానికే పరిమితం చేయకుండా, ప్రతి నెలా క్రమం తప్పకుండా కొనసాగిస్తూ నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. భవిష్యత్తులోనూ ఇదే సేవా స్ఫూర్తితో కార్యక్రమాన్ని కొనసాగిస్తూ మరింతమంది అవసరార్థులకు సహాయం అందించాలనే సంకల్పంతో శ్రీ రామాయణ పారాయణ సేవా సమితి మరియు శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి తమ సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నాయి. కరోనా కష్టకాలంలో వెలిగిన సేవా దీపం నేటికీ ఆరిపోకుండా 61వ నెలలోనూ పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపడం నిజంగా అభినందనీయమైన విషయం.

చందనపల్లిలో మార్కెట్‌కు రైతుల తాకిడి

రెండు రోజుల్లో ఐదు లారీల ధాన్యం రాక.. 12 మంది రైతుల నుంచి కొనుగోళ్లు



నల్గొండ జిల్లా
నవంబర్ 14 వుదయం ప్రతినిధి

నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. పంట చేతికొచ్చిన నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే ఐదు లారీల ధాన్యం మార్కెట్‌కు చేరగా, ఇప్పటివరకు 12 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు మార్కెట్ నిర్వాహకులు శంకర్ తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా మార్కెట్‌లో కొనుగోలు ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం తీసుకొచ్చే రైతులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మార్కెట్‌లో కొనుగోళ్లు ఇదే విధంగా కొనసాగితే మరింత మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మీరు కోరుకుంటే దీనిని ఈనాడు దినపత్రికలో ప్రచురించే జిల్లా వార్తా శైలిలో మరింత ఆకర్షణీయమైన శీర్షికతో కూడా సిద్ధం చేస్తాను.



640 మందికి పైగా స్వాములకు అన్నప్రసాద వితరణ

అనంతగిరి, నవంబర్14 వుదయం

తెలంగాణ శబరిమలగా ప్రసిద్ధిగాంచిన అనంతగిరి అయ్యప్ప సన్నిధిలో కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో 39వ రోజుకు చేరుకుంది. శనివారం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో సుమారు 640 మందికి పైగా అయ్యప్ప స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ రోజు అన్నప్రసాద వితరణకు ఖమ్మం వాస్తవ్యులు ఓరుగంటి పరమేశ్వర్ – జ్యోతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించి తమ భక్తిని, సేవాభావాన్ని చాటుకున్నారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పందిరి వీరయ్య, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు అర్వపల్లి సత్యనారాయణ, కనకయ్య, జెర్రిపోతుల రాము, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, సతీష్ తదితర అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న కారు ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

- మల్లన్నకు జెడ్ ప్లస్ భద్రత కల్పించాలి
- మృతురాలి కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు వైద్యం వెంకటేశ్వర్లు



నల్గొండ జిల్లా, వుదయం ప్రతినిధి

తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కారు ప్రమాద ఘటనపై అనుమానాలను నివృత్తి చేసేందుకు డీజీపీ స్థాయి అధికారితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు వైద్యం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులైన వారిని గుర్తించి, వారు ఏ స్థాయిలో ఉన్నా కఠినంగా శిక్షించాలని కోరారు. బహుజనుల రాజకీయ, సామాజిక, రాజ్యాంగబద్ధమైన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వాటి సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా 14,500 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్న తీన్మార్ మల్లన్న కారుకు అనాజిపురం వద్ద జరిగిన ప్రమాదంలో కుట్ర కోణం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యం వెంకటేశ్వర్లుతో పాటు పలువురు బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రమాద ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కుట్ర కోణం ఉందనే అనుమానాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, బాధ్యులపై ఎలాంటి పక్షపాతం లేకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. దోషులు ఎవరైనా చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్, టీఆర్పీ పట్టణ అధ్యక్షుడు చిలక రాజు సతీష్ కుమార్, టీఆర్పీ నాయకులు కొమ్మనపల్లి ముత్తయ్య, జెర్రిపోతుల రమేష్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు వెంకట నరసయ్య, ఇంద్రయ్య, చిలకరా చెన్నయ్య, పుట్ట వెంకన్న, బక్కతట్ల వెంకన్న, కర్నాటి యాదగిరి, కల్లూరి సత్యనారాయణ గౌడ్, జనిగా లింగస్వామి యాదవ్, మల్లెబోయిన సతీష్ యాదవ్, దామనూరి శీను, జంజిరాల శేఖర్, ఊళ్లేందుల అంజయ్య, పగిళ్ల వెంకన్న, చర్లపల్లి మల్లేష్, గద్దం మారయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలో ఎమ్మెల్యేరాజగోపాల్ రెడ్డి



చండూరు,నవంబర్ 14 (వుదయం):

మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శనివారం అయ్యప్ప దీక్ష (మాలధారణ) స్వీకరించారు. చండూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన భక్తిశ్రద్ధలతో మాల ధరించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సుమారు వంద మందికి పైగా అయ్యప్ప మాలధారణ చేయడం విశేషం. విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల పరిశీలన చండూరులో నూతనంగా నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 14, 15, 16 తేదీలలో (మూడు రోజుల పాటు) విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నూతన ఆలయాన్ని సందర్శించి, ఉత్సవాల ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మూడు రోజుల పాటు జరగబోయే పూజా కార్యక్రమాల వివరాలను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన ఆలయ ప్రతిష్ఠాపన సందర్భంగా నిర్వహించిన విగ్రహాల ఊరేగింపు క్రతువులో ఆయన భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా.కోడి శ్రీనివాసులు,వైస్ చైర్మన్ భూతరాజు దశరథ కౌన్సిలర్లు,పట్టణ ,మండల అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచులు , ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు,అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రేరణ హైస్కూల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

స్కూల్ కరస్పాండెంట్ ఏమి రెడ్డి విష్ణు వర్ధన్ రెడ్డి ప్రిన్సిపాల్ జి మమత



నల్గొండ జిల్లా
నవంబర్ 14 వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణంలోని ప్రేరణ హైస్కూల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎమిరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలే దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే మంచి లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సంస్కారం, సేవాభావం అలవర్చుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ జి. మమత మాట్లాడుతూ.. బాలల దినోత్సవం పిల్లల ప్రతిభను గుర్తించి, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే ప్రత్యేకమైన రోజని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా అయ్యప్ప స్వామి నగర సంకీర్తన

చిలుకూరు, నవంబర్ 14,(వుదయం)

మండల కేంద్రంలో కాంపాటి గురవయ్య గురు స్వామి 18 వ పడి శ్రీ అయ్యప్ప స్వామి మహా మండలి పడిపూజ సందర్భంగా చిలుకూరు గ్రామంలోని ప్రధాన కూడలిలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం పీఠం శ్రీ అయ్యప్ప స్వామి భక్త బృందం కొత్త చిలుకూరు ఆధ్వర్యంలో(నగర సంకీర్తన) గ్రామ ఊరేగింపు ను శనివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా జేజే నగర్ కాలనీలోని గురవయ్య స్వామి ఇంటి నుండి 108 దివ్య జ్యోతులతో అయ్యప్ప స్వామి గ్రామ ఊరేగింపు ప్రారంభమై చిలుకూరు గ్రామంలోని ప్రధాన వీధుల్లో శ్రీ అయ్యప్ప స్వామి గ్రామ ఊరేగింపు (నగర సంకీర్తన) వైభవంగా కొనసాగింది, ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, నరసింహ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఖాజీరామారంలో రోశమ్మ మృతదేహానికి గ్రామ సర్పంచ్ సల్వాది సైదులు, రాములు, జానయ్య కంచర్ల భూపాల్ రెడ్డి నివాళులు



నల్గొండ జిల్లా నవంబర్ 14 వుదయం ప్రతినిధి

నల్లగొండ మండలం ఖాజీరామారం గ్రామ సర్పంచ్ సల్వాది సైదులు తల్లి సల్వాది రోశమ్మ మృతి చెందడంతో నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి రోశమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోశమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కార్పొరేటర్ పేర్ల అశోక్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాసరెడ్డి, కందుల లక్ష్మయ్య, స్థానిక నాయకులు పాలకూరి యాదయ్య, పాలకూరి దశరథ గౌడ్, ఉపసర్పంచ్ సుంకరి మోహన్ రావు, నకరికంటి సైదులు, వార్డు సభ్యులు సుంకరి మహేష్, బొల్లద్దు అశోక్, సుంకరి శీను, పేరపాక జగన్, అంతటి జగన్, ఎస్కే అస్గర్, దండంపెల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జోహన్ జన్మదిన వేడుకలు

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి



నవంబర్ 14. ఈ రోజు భువనగిరి పట్టణం లోని స్థానిక అజాద్ రోడ్ అఖిల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో అఖిల్ ఫాస్ట్ ఫుడ్ అధినేత కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు ఎండీ అఖిల్ గారి కుమారుడు జోహన్ గారి జన్మదిన సందర్భంగా అన్న దాన కార్యక్రమం నిర్వహించడం ఈ సందర్భంగా వారు మాట్లాడు తు అన్ని దాన ల కన్నా అన్న దానం గొప్పది అని తెలిపారు ఈ కార్యక్రమం లో ముఖ్య అతిగా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ గారు పట్టణ సీఐ గారు మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ వార్డ్ కౌన్సిలర్ గుర్రాల సంతోష శ్రీనివాస్ ఎండీ బబ్లు మజర్ జగన్ సుజాయత్ అలీ కౌసర్ జలీల్ తదితరులు పాల్గున్నారు.

చల్లా మల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మునగాల, నవంబర్ 14 (వుదయం):



మునగాల మండలం బారాకత్‌గూడెం గ్రామ సర్పంచ్ చల్లా గురవయ్య మాతృమూర్తి చల్లా మల్లమ్మ మృతి చెందగా, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రామాపురంలో బాలల గ్రామసభ

చిలుకూరు నవంబర్ 14 :(వుదయం)



మండల పరిధిలోని కట్టకమ్మ గూడెం (రామాపురం) గ్రామపంచాయతీ కార్యాలయంలో బాలల దినోత్సవం సందర్భంగా బాలల గ్రామసభను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో, భాగంగా ఎంఈవో ఎన్ శివకుమారి, పాల్గొని ఆమె మాట్లాడుతూ, బాలల హక్కుల కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు ఏమేమి కావాలో బాలలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో, సర్పంచ్ వేమూరి సతీశ్, కార్యదర్శి కిరణ్, గ్రామ పెద్దలు, ఉపాధ్యా యులు విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఘన సన్మానం

అనంతగిరి, నవంబర్ 14 వుదయం



అనంతగిరి మండలంలో నూతనంగా ఏర్పాటైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఇరుగు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మట్టపల్లి ఉపేందర్ గౌడ్‌లకు శుక్రవారం జిల్లా మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ.. పాత్రికేయ రంగంలో ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర గౌరవం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.నూతనంగా ఏర్పాటైన అనంతగిరి ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిష్పక్షపాతంగా వార్తలు అందించాలని సూచించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు ఇరుగు వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి మట్టపల్లి ఉపేందర్ గౌడ్ తెలిపారు. పెద్దల సూచనలు, సలహాలతో జర్నలిస్టులందరినీ కలుపుకొని ఐక్యతతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.నూతన కార్యవర్గానికి పెద్దల ఆశీస్సులు, అభినందనలు లభించడంతో అనంతగిరి ప్రెస్ క్లబ్‌లో నూతన ఉత్సాహం నెలకొంది.



భారత్ సమ్మిట్ – 2026 పాల్గొన్న కుంభం అనిల్ కుమార్

యాదాద్రి భువనగిరి జిల్లా , వుదయం ప్రతినిధి

హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ (HICC), హైటెక్స్ వేదికగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక భారత్ సమ్మిట్ – 2026 ఈ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, విధాన నిర్ణేతలు, మేధావులు, ప్రముఖులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచ దేశాల మధ్య సహకారం వంటి కీలక అంశాలపై చర్చలు జరిగాయి.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

మునగాల, నవంబర్ 14 (వుదయం):



మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామ శివారులోని స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కోదాడకు చెందిన సాయి శ్రీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దుబ్బాక రాజమోహన్ రెడ్డి, డాక్టర్ అజిత దంపతులు, వారి కుమారుడు సింహాత్ రెడ్డి, కుమార్తె చిన్ని, దుబ్బాక మల్లారెడ్డి, పద్మావతి దంపతులు, కుందూరు జనార్దన్ రెడ్డి, రాజ్యలక్ష్మి దంపతులు కలిసి నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

గిగ్ వర్కర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా

రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం



నల్గొండ జిల్లా నవంబర్ 14 వుదయం ప్రతినిధి

హైదరాబాద్, గిగ్ వర్కర్ల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక పథకాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌లో వేలాది మంది గిగ్ వర్కర్ల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులతో కలిసి రాహుల్‌గాంధీ చేతుల మీదుగా 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' ప్రారంభించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గిగ్ వర్కర్లు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు సామాజిక భద్రత, సంక్షేమం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గిగ్ వర్కర్లకు భద్రతతో కూడిన భవిష్యత్తు కల్పించే దిశగా ప్రజా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

మోతుకూరి విజయలక్ష్మికి ఘన నివాళులర్పించిన మాజీ ఎంపీ నామ

ఖమ్మం వుదయం బ్యూరో నవంబర్



ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మోతుకూరి విజయలక్ష్మి పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరై విజయలక్ష్మి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె భర్త మాజీ సొసైటీ చైర్మన్ మోతుకూరి వెంకటేశ్వరరావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని విజయలక్ష్మి సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. కార్యక్రమంలో కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాదరావు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, గొడ్డేటి మాధవరావు, తాజుద్దీన్, నలజాల రవి, నామ రాజేష్, చుంచు విజయ్, తాతా సుధాకర్, బాలకృష్ణ, దుద్దుకూరు సత్యనారాయణ, మోతుకూరి సత్యం, తాతా ప్రసాద్, పాసంగలపాటి శ్రీను, పొన్నం లక్ష్మయ్య, మధు, మోతుకూరి శ్రీనివాసరావు, రాంబాబు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

సర్పంచ్ నందిగామ శ్రీనివాస్



అనంతగిరి, నవంబర్ 14:వుదయం

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వాయిలి సింగారం గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాస్ అన్నారు. అనంతగిరి మండలంలోని వాయిల సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ఉత్తర్వుల కాపీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నందిగామ శ్రీనివాస్ తన చేతుల మీదుగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో దాదాపు 60 మందికి నూతనంగా జీవితకాల పింఛన్లు మంజూరు కావడం ఎంతో సంతోషకరమైన విష య మ న్నారు. ల బ్ధిదారుల ఒద్ద రూ స్వయంగా హాజరైన నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పింఛన్ల మంజూరు ఉత్తర్వుల ప్రతులను అందుకున్న లబ్ధిదారుల ఖాతాల్లో 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం పింఛన్ నగదును జమ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాములూరి మురళి గుండ్లపల్లి వెంకన్న కొల్లు సుబ్బారావు ,బుర్ర వీరబాబు, హైస్కూల్ హెచ్ఎం వెంకట్, గ్రామ ఉపసర్పంచ్ రమాదేవి, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, నూతన పింఛన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీతో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్గొండ జిల్లా నవంబర్ 14 వుదయం ప్రతినిధి



హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ, నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పరం అభివాదం చేసుకున్నారు.

సెల్ టవర్లలో ఆర్ఆర్‌యూ యూనిట్ల చోరీ

- ఇంజినీర్ల ముఠా అరెస్ట్
- పని చేస్తున్న సంస్థకే కన్నం.. తొమ్మిది మంది నిందితుల అరెస్ట్
- తెలుగు రాష్ట్రాల్లో 38 చోరీలు.. రూ.1.62 కోట్ల మేర నష్టం
- రూ.25 లక్షల విలువైన మూడు కార్లు, రెండు బైక్‌లు, రూ.15 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం : జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, జిల్లా నవంబర్ 14 వుదయం ప్రతినిధి నవంబరు 14:

నల్గొండ పట్టణ కేంద్రంలో పని చేస్తున్న సంస్థకే కన్నం వేసి ఖరీదైన ఎయిర్‌టెల్ మొబైల్ టవర్లలోని రేడియో రిమోట్ యూనిట్ల (ఆర్ఆర్‌యూ)ను వరుసగా చోరీ చేస్తున్న ఇంజినీర్లు, సిబ్బంది ముఠా గుట్టును నల్లగొండ జిల్లా సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. సంస్థలో పనిచేస్తున్న ముగ్గురు ఇంజినీర్లు, నలుగురు టెక్నీషియన్లు, డ్రైవర్‌తో పాటు గతంలో అదే సంస్థలో పనిచేసిన మరో ఉద్యోగి సహా మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వీరు తెలుగు రాష్ట్రాల్లో 38 చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ చోరీల ద్వారా సుమారు రూ.1.62 కోట్ల విలువైన ఆర్ఆర్‌యూ యూనిట్లను అపహరించినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. నిందితుల నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.15 లక్షల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రత్యేక బృందాలతో నిఘా..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొబైల్ టవర్లకు సంబంధించిన ఆర్ఆర్‌యూ యూనిట్లు వరుసగా చోరీ అవుతుండటంతో ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్‌రెడ్డి పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ చోరీల వెనుక సంస్థలో పనిచేస్తున్న వారే ఉన్నట్లు గుర్తించారు. తమకు ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ సంస్థకే నష్టం కలిగిస్తున్నట్లు విచారణలో తేలింది.

వాహన తనిఖీల్లో పట్టుబడ్డ ముఠా..

త్రిపురారం, నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన రెండు చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా నవంబరు 14న పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. నల్లగొండ రూరల్ పోలీసుల తనిఖీల్లో గిగిరకలబావిగూడెం శివారులోని చింతచెట్టు వద్ద ఐదుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. కాంచనపల్లి గ్రామంలో ఆర్ఆర్‌యూ యూనిట్ల చోరీకి వెళ్తున్నట్లు వారు వెల్లడించారు. అదే సమయంలో త్రిపురారం పోలీసులు బాబాసాయిపేట వద్ద నిర్వహించిన తనిఖీల్లో మరో నలుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారిలో గతంలో నేరాలకు పాల్పడిన రమావత్ సుమన్‌ను గుర్తించారు. విచారణలో గతంలో చేసిన ఆర్ఆర్‌యూ చోరీల వివరాలు బయటపడ్డాయి. ఈ కేసులను సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన త్రిపురారం ఎస్ఐ కె.నరేశ్, నల్లగొండ రూరల్ ఎస్ఐ, సీసీఎస్ ఎస్ఐ సురేశ్, హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్‌గిరి, పుష్పగిరి, ఫయాజ్, నాగరాజు, కానిస్టేబుళ్లు అస్రార్, సాయి, శివరాజు, నరేశ్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు. అరెస్టయిన నిందితులు: నకిరేకంటి స్వర్ణకుమార్, భూక్యా బాలు, శ్రీకాంత్‌రెడ్డి, రమావత్ సుమన్, లకావత్ రాములు, జక్కల నితీష్‌కుమార్, పెంటమల్ల మహేష్, భీమనపల్లి రవి, అంగోతు తిరుపతి.



శివాలయం కాలనీలో డ్రైనేజీ, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలోని శివాలయం కాలనీలో నెలకొన్న ప్రధాన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. శివాలయం కాలనీలో మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మురుగునీరు నిల్వ ఉండటం వల్ల పరిసరాల పరిశుభ్రతకు ఆటంకం కలుగుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో జువ్వగాని శ్రీకాంత్, బోదాసు బాలరాజు, పాల్వంచ గణేష్, సిరికొండ వెంకటేష్, ఎండీ జానీ, ఏడో వార్డు సభ్యుడు జువ్వగాని మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇడికుడలో బాలల దినోత్సవ వేడుకలు


నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సర్పంచ్ రమాదేవి-శ్రవణ్‌రెడ్డి

చండూరు, నవంబర్ 14 (వుదయం):



మండలంలోని ఇడికుడ గ్రామంలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ పాల్వాయి రమాదేవి–శ్రవణ్‌రెడ్డి, తొలుత భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి నెహ్రూ చేసిన సేవలను, పిల్లల పట్ల ఆయనకున్న అమితమైన ప్రేమను విద్యార్థులకు వివరించారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో శ్రీనివాస్ రెడ్డి ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు స్థానికులు పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు



మధిర, నవంబర్,14, వుదయం, ప్రతినిధి:

మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహోన్నత నాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆధునిక భారతదేశ నిర్మాణానికి బలమైన పునాదులు వేశారని తెలిపారు. పరిశ్రమలు, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, వ్యవసాయం, ప్రజాస్వామ్య వ్యవస్థల అభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. పిల్లలంటే ఎంతో ప్రేమ కలిగిన నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు దేశం అందిస్తున్న గౌరవమని, ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన ధని కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, వెంకటాపురం సర్పంచ్ హరనాథ్, కౌన్సిలర్లు ధారా నాగార్జున, శ్రీపాలశెట్టి వెంకట్రావు, బాణావత్ వెంకటరమణ నాయక్, రామాలయ కమిటీ చైర్మన్ వంగవీటి రాజశేఖర్, వనమా సూరి, దుంప వెంకటేశ్వరరెడ్డి, బిట్రా ఉద్దండయ్య ,సామినేని రామనాథం, షేక్ గౌసుద్దీన్, జాకీర్ హుస్సేన్, మువ్వా వెంకయ్యబాబు, బొమ్మకంటి హరిబాబు, పత్తిపరపు సంగయ్య, దోర్నాల నాగమురళి, కోట డేవిడ్, గద్దల నాని, గద్దల రాజా, దూదేకుల జానీ, మోదుగు బాబు, దోర్నాల సంతోష్, లింగంపల్లి అప్పారావు ,నాయకులు పాల్గొన్నారు.

గీతా విద్యాలయంలో ఘనంగా బాలల దినోత్సవం

ప్రిన్సిపాల్ పోలోజు నరసింహాచారికి జాతీయ స్థాయి 'నెహ్రూ అవార్డు' ప్రదానం

చండూరు,నవంబర్ 14 (వుదయం):



భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని స్థానిక గీతా విద్యాలయం (E/M) పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేస్తూ నెహ్రూ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రిన్సిపాల్ పోలోజు నరసింహాచారి మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రిన్సిపాల్ పోలోజు నరసింహాచారి ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి 'నెహ్రూ అవార్డు'కు ఎంపికయ్యారు. వేడుకల సందర్భంగా శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కంబాలపల్లి శివలీల చేతుల మీదుగా ఆయనకు ఈ అవార్డును అందజేశారు. జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

రెవ.డా. శాంసన్ మామిడి జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్

సూర్యాపేట నవంబర్ 14 : వుదయం ప్రతినిధి



సూర్యాపేట జిల్లా కేంద్రం 5వ వార్డులోని న్యూ లైఫ్ చర్చి, సువెన్ కంపెనీ వద్ద న్యూ లైఫ్ మినిస్ట్రీస్ ఫౌండర్, సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ రెవ.డా. శాంసన్ మామిడి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవ.డా. ఎం. ప్రభుదాస్, రెవ. పి. జాన్ మార్క్, రెవ. మిట్టగూడెం హజరయ్య, రెవ. డాక్టర్ సిప్పా, రెవ. జవహర్ పాల్, పాస్టర్ మాదుగుల సుందర్ రావు, హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు రెవ. మెసా దేవసహాయం, రెవ. మాతంగి పీటర్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 100 మంది పాస్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

భరత్ విద్యాసంస్థల్లో బాలల దినోత్సవ వేడుకలు

మధిర, నవంబర్,14, వుదయం, ప్రతినిధి:



భరత్ విద్యాసంస్థల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సంస్థల అధినేతలు శీలం వెంకటరెడ్డి, విద్యాలత విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నెహ్రూ జీవిత విశేషాలను, ఆయనకు పిల్లలపై ఉన్న ప్రేమాభిమానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు, డీన్ కటికల రవీందర్ రెడ్డి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ టి. ఉమా, ఇన్‌చార్జ్ బి. స్రవంతి, ప్రీ ప్రైమరీ ప్రిన్సిపల్ బి. ప్రియాంకతో పాటు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో చిన్నారులకు దుస్తుల అందజేత

చింతకాని, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):



రామకృష్ణాపురం గ్రామంలో నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రామకృష్ణాపురం బీసీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేశారు. మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలోని హంగర్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమంలో భాగంగా, మైక్రో లెర్నింగ్ సెంటర్, ధనాల్దయ రిహాబిలిటేషన్ ట్రస్ట్ నిర్వహణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి ఉపసర్పంచ్ గాదె రామారావు పాల్గొని చిన్నారులకు స్కూల్ డ్రెస్సులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లల విద్యాభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పిల్లలు స్కూల్ టీచర్ గాదె రేణుక పిల్లల తల్లిదండ్రులు మస్తులు పాల్గొన్నారు.

దేశానికి అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని చాటిన గురుకుల విద్యార్థులు

మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గాదె లింగస్వామి

నల్గొండ జిల్లా నవంబర్ 14 వుదయం ప్రతినిధి



దేశానికి అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని, వ్యవసాయం ప్రాధాన్యతను చాటిచెబుతూ తిప్పర్తి గురుకుల పాఠశాల విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రైతు కష్టాన్ని, పంట పండించేందుకు ఆయన పడే శ్రమను, దేశ ప్రజల ఆకలి తీర్చడంలో రైతు పోషిస్తున్న కీలక పాత్రను విద్యార్థులు తమ అద్భుతమైన నృత్య ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. చిన్నారుల్లోనే రైతుల పట్ల గౌరవం, వ్యవసాయంపై అవగాహన, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించేలా ఈ ప్రదర్శన సాగడం విశేషం. కేవలం పుస్తకాల్లోని పాఠాలకే పరిమితం కాకుండా, సామాజిక స్పృహను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో చదువుతోపాటు సాంస్కృతిక, సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మట్టిలో మాణిక్యాల్లాంటి ప్రతిభావంతులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందం కృషి అభినందనీయం. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు నిరంతరం శ్రమిస్తున్న అధ్యాపకులకు హృదయపూర్వక అభినందనలు. ఇలాంటి విద్యాసంస్థలకు, విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తూ అవసరమైన సహకారం అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. భావితరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిద్దాం. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గాదె లింగస్వామి, బాయ్స్ ప్రిన్సిపాల్ రమేష్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బక్క నరసింహ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు కార్యవర్గ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కోదాడ నవంబర్ 14 (వుదయం)



కోదాడ: గుడిబండ గ్రామంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మందుల నాగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలల ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జయసింహారెడ్డి, గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ వి ఇంగ్లీష్ మీడియం లో బాలల దినోత్సవం

రెబ్బెన, వుదయం ప్రతినిధి



రెబ్బెన మండలంలోని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శనివారం బాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి ముఖ్య అతిథులు నాయకులు గుంపుల విమలేష్, మోడెమ్ సుదర్శన్ గౌడ్, గోపాల అగర్వాల్, జమీరుద్దీన్ లతోపాటు ప్రిన్సిపాల్ దీకొండ సంజీవ్ కుమార్ పూలమాలలు వేశారు. అనంతరం బాల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించగా మొదటి, రెండవ ,బహుమతులను వచ్చిన విద్యార్థులకు ముఖ్య అతిథులు గుంపుల విమలేష్, సుదర్శన్ గౌడ్, బహుమతులను అందజేశారు . అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల గత 29 సంవత్సరాలుగా విద్యార్థులకు ఏనలేని సేవలు చేస్తూ వస్తుందని, ఎస్ వి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివిన విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నారని వారు తెలిపారు. విద్యార్థులకు ఉన్నత విద్యతోపాటు ఉత్తమమైన క్రమశిక్షణ నేర్పుతూ మంచి మార్గంలో నడిపించే పాఠశాల ఎస్వీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ అని కొనియాడారు. అనంతరం పిల్లలు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దీకొండ విజయ్ కుమారి, డైరెక్టర్ హిమబిందు, ఉపాధ్యాయులు మంజు సురేష్ ,నీలిమ, శ్రీనివాస్, మహేందర్, తిరుపతి, అరుణ ,సంధ్య లు ఉన్నారు.

పర్ధాన్ గూడ పాఠశాలలో బాలల దినోత్సవం

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం అందుగుల గూడ గ్రామపంచాయతీ లోని పర్ధాన్ గూడ లోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కావున ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో విద్య నేర్చుకుని సమాజానికి తమ వంతుగా సహాయ పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



కాపుగల్లులో ఘనంగా బాలల దినోత్సవం

కోదాడ నవంబర్ 14 (వుదయం)

కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దొంతగాని అప్పారావు అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్యవివాహాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుకుల రామారావు, పంచాయతీ కార్యదర్శి కావ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



నయానగర్ చర్చిలో ఘనంగా బాలల దినోత్సవం

కోదాడ నవంబర్ 14 (వుదయం)

కోదాడ పట్టణంలోని నయానగర్ బాప్టిస్ట్ చర్చిలో వంటేపాక జానకి యేసయ్య ఆధ్వర్యంలో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బాలల భవిష్యత్తు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలి

మండవ వెంకటాద్రి పిలుపు

మునగాల, నవంబర్ 14 (వుదయం):




నేడు నల్లగొండలో నిర్వహించనున్న అఖిలభారత రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు, కలకోవ గ్రామ సర్పంచ్ మండవ వెంకటాద్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న మహాసభలకు రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలి

ఉప సర్పంచ్ మొగిలిచర్ల సీతారాములు

మునగాల, నవంబర్ 14 (వుదయం):



నల్లగొండ పట్టణంలో నేడు ప్రారంభమవుతున్న అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని నరసింహులగూడెం ఉప సర్పంచ్ మొగిలిచర్ల సీతారాములు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే రైతు సంఘం మహాసభలకు మునగాల మండలం నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ మహాసభలను రైతులంతా ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్యకర్త నుంచి నాయకుడిగా..

దేవరకొండలో ఎదుగుతున్న యువ స్వరం షేక్ ఇస్మాయిల్

దేవరకొండ, నవంబర్ 14(వుదయం):



రాజకీయాల్లో నాయకత్వం అనేది ఒక్క రోజులో వచ్చేది కాదు. ప్రజల మధ్య నిరంతరం పనిచేస్తూ, వారి సమస్యలపై స్పందిస్తూ, నమ్మకాన్ని సంపాదించుకున్నప్పుడే నిజమైన గుర్తింపు లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ (BRS) యువ నాయకుడు షేక్ ఇస్మాయిల్ రాజకీయ ప్రయాణం ఇదే కోణంలో స్థానిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉద్యమ నేపథ్యం.. ప్రజల సమస్యలపై అవగాహన దేవరకొండ నియోజకవర్గం లోని కొండమల్లేపల్లి మండలం, గుమ్మడవల్లి గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను చూస్తూ పెరిగారు. ముఖ్యంగా నల్లగొండ జిల్లాను పట్టిపీడించిన ఫ్లోరైడ్ మహమ్మారి, సాగునీటి కష్టాలు, రైతుల ఆత్మహత్యలు, అలాగే దేవరకొండ ప్రాంతంలో ఆడపిల్లల విక్రయాల వంటి సామాజిక సమస్యలు ఆయనను ఆలోచింపజేశాయని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. ఈ దోపిడీని ప్రశ్నించాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ నాయకత్వంలో సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమం నుంచి టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీ కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొనడం ప్రారంభించారు.

కార్యకర్తగా మొదలై.. నాయకత్వ లక్షణాలతో..

పార్టీలో ఒక సాధారణ కార్యకర్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఇస్మాయిల్, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ అనుచరుడిగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంతో పాటు, స్థానిక సమస్యలపై గళం విప్పుతూ క్రమంగా నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై ప్రశ్నలు మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుత రాజకీయాల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. ఈ వేదికను సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్న షేక్ ఇస్మాయిల్, నిత్యం ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ అధికార కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రశ్నలు సంధిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలులో జాప్యంపై తనదైన శైలిలో పోస్టులు, వీడియోల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయి సమస్యలను రాజకీయ చర్చల్లోకి తీసుకురావడం ద్వారా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల ఒక బహిరంగ సభలో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలు నాయక్ సైతం బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రస్తావించడం నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగించింది.

పదవి లేకపోయినా పోరాటమే ఊపిరిగా..

పార్టీ జెండా మోసే కార్యకర్త స్థాయి నుంచి ప్రజల సమస్యలపై మాట్లాడే స్థాయికి ఎదగడం అంత సులభం కాదని, అందుకు నిరంతర శ్రమ, ప్రజలతో మమేకమయ్యే తత్వం అవసరమని ఇస్మాయిల్‌ను దగ్గరగా గమనిస్తున్న నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి పదవి లేకపోయినా, యువతను కలుపుకుపోతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే నాయకత్వానికి తొలి మెట్టు అనే భావనతో ఆయన ముందుకు సాగుతున్నారని స్థానిక కార్యకర్తలు చెబుతున్నారు.

అగ్రనాయకత్వం దృష్టిలో పడేలా..

ఒక మారుమూల పల్లెటూరి నుంచి కార్యకర్తగా మొదలైన షేక్ ఇస్మాయిల్ ప్రయాణం, నేడు నియోజకవర్గ స్థాయి దాటి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు వంటి అగ్రనాయకుల దృష్టిని ఆకర్షించే స్థాయికి చేరుకుందని ఆయన మద్దతుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నిన్న పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తగా, నేడు ప్రజల కోసం గొంతెత్తుతున్న యువకుడిగా గుర్తింపు పొందుతున్న ఇస్మాయిల్‌కు భవిష్యత్తులో పార్టీలో మరింత సముచిత స్థానం, ప్రాధాన్యత దక్కాలని ఆయన సన్నిహితులు, అభిమానులు కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో దేవరకొండ రాజకీయాల్లో ఆయన ప్రస్థానం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఆర్యవైశ్యుల ఐక్యతతోనే సమాజ అభివృద్ధి – నల్మాస్ కాంతయ్య

లక్షెట్టిపేట, నవంబర్ 14:

ఆర్యవైశ్యులు ఐక్యతతోనే సమాజ అభివృద్ధి అని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ముఖ్య సలహాదారు నల్మాస్ కాంతయ్య అన్నారు. శనివారం లక్షెట్టిపేట మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శి ముక్త శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంఘంలో పదవులు బాధ్యతతో కూడుకున్నవని, వాటిని సమాజ అభ్యున్నతికి వినియోగించాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిలువేరు వైకుంఠం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా గౌరిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కటకం అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుంజర్ల శ్రీనివాస్, కోశాధికారిగా బొద్దుకూరి నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వొజ్జల రాజమౌళి, గుండ ప్రభాకర్, లక్షెట్టిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చెట్ల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వొజ్జల శ్రీనివాస్, ఐక్య వ్యాపార సంఘం అధ్యక్షులు మైలారపు సుధాకర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు గడ్డం వికాస్, అవోపా జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజర్ల శ్రీనివాస్, పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు నరేందుల సాహితి, ప్రధాన కార్యదర్శి హారతి, కోశాధికారి కాసం స్వప్న, చింతల రంజిత్, బొద్దుకూరి రాజ్‌కుమార్, ఏలుగూరి వేణు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తుకు ప్రోత్సాహం అవసరం

మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 14 :



బాలలే దేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారి కలలను సాకారం చేసేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని విజ్డమ్–ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, లక్ష్య కాకతీయ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఓటములకు భయపడకుండా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలల్లో చిన్నారులు ప్రదర్శించిన ప్రతిభను అభినందించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎమ్మెల్యేలను కోరిన టీయూడబ్ల్యూజే–ఐజేయూ నాయకులు

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 14 నవంబర్ 2026

ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) నిర్మల్ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని యూనియన్ నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని యూనియన్ నాయకులు వివరించారు. అయినప్పటికీ అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో పాటు నివాస సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ఈ విషయంలో ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు.

ఈ నెల 25న జరిగే జిల్లా మహాసభల్లో జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అంశాలపై చర్చించనున్నట్లు నాయకులు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతులు వివరించారు. మహాసభలకు మాజీ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్ ని ఆహ్వానం ఈనెల 25వ తారీఖున నిర్వహించే తెలంగాణ స్టేట్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ మహాసభలకు మాజీ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్ ని కలిసి ఆహ్వానం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య, జాతీయ కార్యవర్గ సభ్యులు గాండ్ల రాజశేఖర్, జిల్లా కోశాధికారి వీ. ప్రశాంత్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ డి. యోగేష్, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మల అశోక్, పూసాల పోశెట్టి, వేణుగోపాల్, తన్వీర్,



జిల్లా కార్యదర్శులు జల్ల మనోజ్, హనుమాన్లు, భోజా రెడ్డి, రాజేశ్వర్, డీఎస్ మధు, గంగాధర్, చంద్రశేఖర్, సాయిరాజ్ గౌడ్, శివరామకృష్ణ, ప్రసాద్,శ్రీనివాస్, భోజన్న, శ్రీనివాస్,వెంకటరమణ, కోడే మధు, ప్రశాంత్, ప్రభాకర్ రెడ్డి, లింగేశ్వర్,జహీర్, రమేష్, మల్లేష్, బ్రహ్మం,రాజన్న, ఇంథయే ఆలీ, ఉమేష్ గుప్తా, మధుకర్,తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ భారత్ సమ్మిట్‌లో గజేందర్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 14 :



హైదరాబాద్‌లో నవంబర్ 13, 14తేదీల్లో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ భారత్ సమ్మిట్–2026లో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 దేశాలకు చెందిన రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, విధాన నిర్ణేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి, యువత భవిష్యత్తు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి కీలక అంశాలపై జరిగిన చర్చలను ఆడే గజేందర్ ఆసక్తిగా పరిశీలించారు. వివిధ దేశాల ప్రతినిధులు, అంతర్జాతీయ నాయకుల ఆలోచనా విధానాలు, అభివృద్ధి నమూనాలను తెలుసుకునే అవకాశం ఈ సదస్సు ద్వారా లభించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి సమావేశంలో పాల్గొనడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న రాజకీయ, సామాజిక పరిణామాలపై అవగాహన పెంపొందించుకునే అవకాశం కలిగింది.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన ఎం జె పి విద్యార్థినీలు

ఆసిఫాబాద్,(వుదయం ప్రతినిధి)



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల బాలికలు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ క్రీడా విభాగాల్లో రాణించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించడంతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. కబడ్డీ విభాగంలో వైష్ణవి బృందం ప్రథమ స్థానం సాధించింది. 400 మీటర్ల పరుగు పందెంలో వైష్ణవి, 1500 మీటర్ల పరుగులో బిక్కుబాయి ప్రథమ స్థానాలు పొందారు. డిస్కస్ త్రోలో జె. సుజాత ప్రథమ స్థానం సాధించగా, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. టెన్నికాయిట్‌లో సుజాత, అశ్విత శ్రీ ద్వితీయ స్థానం సాధించారు. లాంగ్ జంప్, 400 మీటర్ల పరుగు పందెంలో జి. అక్షయ ద్వితీయ స్థానాలు పొందగా, డిస్కస్ త్రోలో ఎ. హిమబిందు ద్వితీయ, షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించారు. 800 మీటర్ల పరుగులో ఎం. హర్షిక తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుని పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. విద్యార్థినిలు సాధించిన విజయాలపై ఆర్ సి ఓ శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపల్ రత్నాబాయి ఉపాధ్యాయ సిబ్బంది వర్షం వ్యక్తం చేశారు.

ప్రయాణికులకు ఆర్టీసీ తీపికబురు.. ఎంటీఎస్ టికెట్లపై ప్రత్యేక రాయితీలు!

మహిళలకు మరింత ప్రయోజనం.. 15 రోజుల చార్జీతో నెలవారీ టికెట్!

ఆసిఫాబాద్, నవంబర్ 14:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) ప్రయాణికులకు శుభవార్త అందించింది. నెలవారీ సీజన్ టికెట్ల (MST) విధానంలో పలు కొత్త సౌకర్యాలు, ప్రత్యేక రాయితీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నూతన సౌకర్యాలు నవంబర్ 14 నుంచి అమలులోకి వస్తాయని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ కె.వి. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త విధానం ప్రకారం నెలవారీ సీజన్ టికెట్ల చార్జీలను గతంలో 25 రోజుల ప్రాతిపదికన లెక్కించగా, ఇకపై 20 రోజుల చార్జీతో అందించనున్నారు. మహిళా ప్రయాణికులకు మరింత ప్రయోజనం కల్పిస్తూ వారి MST టికెట్ల చార్జీలను కేవలం 15 రోజుల ప్రాతిపదికన లెక్కించనున్నారు. అలాగే నిర్ణీత రూట్, చార్జీల నిబంధనలకు లోబడి దూర పరిమితి లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించడంతో పాటు డీలక్స్ MST టికెట్లను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్ నగరాల్లోని సిటీ బస్సుల్లో MST ప్రయాణికులకు ఆదివారాల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు. అయితే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్స్, ఇతర ప్రత్యేక సర్వీసులకు ఈ సౌకర్యం వర్తించదు. EXP MST, PVG MST ప్రయాణికులు నిర్ణీత బస్సు కేటగిరీల్లో అదనంగా రూ.20 చెల్లించి కాంబో టికెట్ పొందవచ్చు. MST రూట్ కాకుండా ఇతర రూట్లలో సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో బేసిక్ ఛార్జీపై 10 శాతం రాయితీ కల్పించనున్నారు. రెండు నెలల MST టికెట్‌కు అదనంగా 5 రోజుల చెల్లుబాటు, మూడు నెలల MST టికెట్‌కు అదనంగా 10 రోజుల చెల్లుబాటు కల్పించనున్నారు. ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించి ప్రజా రవాణా సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ సౌకర్యాలను ప్రవేశపెట్టినట్లు డిపో మేనేజర్ కె.వి. రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

200 ఎకరాల వరి పంటకు నీటి గండం!

తక్కువ వర్షపాతంతో ఎండిపోతున్న మైసమ్మ చెరువు.. చేతికొచ్చే సమయంలో రైతులకు కన్నీళ్లే మిగిలేనా?

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా | తిర్యాణి:



తక్కువ వర్షపాతం.. అడుగంటిన చెరువులు..సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు! ప్రకృతి పరిస్థితులు అన్నదాతలకు పరీక్ష పెడుతున్నాయి. నెలల తరబడి కష్టపడి సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తిర్యాణి మండలం గుండాల గ్రామ పంచాయతీ పరిధిలోని మైసమ్మ చెరువులో వర్షపాతం తక్కువగా ఉండడంతో నీరు అడుగంటిపోయింది. చెరువు తూము నుంచి సాగునీరు అందక సుమారు 200 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు ముప్పు ఏర్పడింది. రైతులు అప్పులు చేసి, వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి పంటను సాగు చేశారు. పంట కోతకు సిద్ధమవుతున్న సమయంలో నీటి కొరత ఏర్పడటంతో తమ కష్టం వృథా అవుతుందేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్లముందే పంట ఎండిపోయే పరిస్థితి నెలకొనడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చెరువుల్లో నీరు లేక.. పొలాలకు సాగునీరు అందక.. అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. వర్షపాతం తగ్గి చెరువుల్లో నీరు అడుగంటడంతో సాగునీటిపై ఆధారపడిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు చేతికొస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. సుమారు 200 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లకుండా సంబంధిత నీటిపారుదల, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం అని అన్నారు.

దుర్గం శేఖర్‌కు బాల్య మిత్రుల సన్మానం

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 14 :



ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన దుర్గం శేఖర్‌ను ఆయన బాల్య మిత్రులు ఘనంగా సన్మానించారు. సుమారు 38 ఏళ్ల స్నేహబంధాన్ని గుర్తు చేసుకుంటూ పూల బొకే అందించి, శాలువాతో సత్కరించారు. హోదాలు, పదవులు మారినా తమ మధ్య స్నేహం, ఆత్మీయత కొనసాగడం ఆనందంగా ఉందని మిత్రులు పేర్కొన్నారు. అలాగే ఎస్.ఆర్. న్యూట్రిషన్ వరల్డ్ నిర్వాహకులు, సీనియర్ వెల్నెస్ కోచ్ దుర్గ భాస్కర్ రెడ్డి దంపతులు దుర్గం శేఖర్‌ను కలిసి అభినందించి సత్కరించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ బాబు, పవన్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దాహేగాం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవితాల్లో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అలాగే దాహేగాం మండల సమగ్ర అభివృద్ధికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని, మండలంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో మాటలకే పరిమితం కాకుండా త్వరలోనే అభివృద్ధి పనులు చేపట్టి తమ చిత్తశుద్ధిని చేతల్లో చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పెన్షన్ లబ్ధిదారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఆలయాలు ఆధ్యాత్మికతకు, ఐకమత్యానికి ప్రతీకలు

అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 14 :



ఆలయాలు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు గ్రామ ప్రజల మధ్య ఐకమత్యం, సద్భావనను చాటుతాయని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకుంటూ సమాజంలో సోదరభావంతో మెలగాలని ఆయన ఆకాంక్షించారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామంలో శ్రీ శబరి మాత ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన తన సతీమణి కంది మౌన శ్రీనివాస రెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పు చప్పుళ్ల మధ్య పూలమాలలతో కంది దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి రిబ్బన్ కట్ చేసి శ్రీ శబరి మాత ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు కంది శ్రీనివాస రెడ్డి దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధునిక భారత నిర్మాణ శిల్పి పండిట్ నెహ్రూ

- **మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొట్నాక గణపతి**
- **తిర్యాణిలో ఘనంగా నెహ్రూ 137వ జయంతి వేడుకలు**



తిర్యాణి: భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారి ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని తిర్యాణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొట్నాక గణపతి పిలుపునిచ్చారు. శనివారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కొట్నాక గణపతి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో నెహ్రూ పోషించిన పాత్ర, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆధునిక భారత నిర్మాణానికి ఆయన వేసిన పునాదులే నేటి దేశ అభివృద్ధికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ మరియు జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్ నైతం రాంచందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్దె విజయ్, జిల్లా కార్యదర్శి కుర్సెంగా శోభన్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లి కొమురయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆత్రం లక్ష్మి న్, చుంచు బాపురావు, పార్టీ సీనియర్ నాయకులు బుద్దె శేఖర్, మండల అధికార ప్రతినిధి కూన సురేష్,మండల ప్రధాన కార్యదర్శులు గౌర్య కుమార్, దుర్గం పవన్ కుమార్, ఎస్సీ సెల్ మండల నాయకులు జుగ్నక మారుతి, ఎస్సీ సెల్ మండల నాయకుడు మల్యాల అశోక్, సేవాదళ్ మండల నాయకులు బోరకుంట శంకర్, మండల పార్టీ కార్యదర్శులు కోవ శంకర్, పూసం రాజు, రొంపల్లి బుద్దె బన్నయ్య,ఎస్టీ సెల్ మండల నాయకుడు సిడం. జలపతి రావ్ తలండి సర్పంచ్ నైతం మంగు, గ్రామపంచాయతీ కమిటీ ప్రధాన కార్యదర్శి పంద్రం ఏశ్వంత్ రావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పాఠశాలలు, ఆలయాల పరిసరాల్లో అక్రమ విక్రయాలపై ఉక్కు పాదం

జిల్లా ఎస్పీ నికిత పంత్


ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల పరిసరాలను మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంచేందుకు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్, కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల 100 మీటర్ల పరిధిలో ఉన్న కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, ఇతర వ్యాపార కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం, గుట్కా, సిగరెట్లు తదితర పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 31 కేసులు నమోదు చేశారు. వీటిలో ఎక్సైజ్ చట్టం కింద కేసులు నమోదు చేసి, 3.24 లీటర్ల మద్యం, వివిధ రకాల పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో జిల్లా పోలీస్ అధికారులు,పోలీస్ స్టేషన్ల సిబ్బంది మరియు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన భార్గవ్ దేశ్ పాండే

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 14 :



భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును బీఆర్‌ఎస్ యువ నాయకుడు భార్గవ్ దేశ్ పాండే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాల్లో యువత చురుకుగా పాల్గొనాలని భార్గవ్ దేశ్ పాండే పిలుపునిచ్చారు. బంగారు తెలంగాణ పునర్నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, రాష్ట్ర అభివృద్ధి కోసం యువత ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు కొత్త రాయితీలు

డిపో మేనేజర్ కె.వి రాజశేఖర్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)


టీజీఎస్ఆర్టీసీ నెలవారీ సీజన్ టికెట్ (ఎంఎస్‌టీ) ప్రయాణికులకు సంస్థ పలు కొత్త సౌకర్యాలు, రాయితీలు కల్పించినట్లు డిపో మేనేజర్ కె.వి రాజశేఖర్ తెలిపారు. నవంబర్ 14 నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఎంఎస్‌టీతో రూట్ పరిమితి లేకుండా ప్రయాణించవచ్చని, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఈ–టికెట్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్‌లో ఆదివారాల్లో ఉచిత ప్రయాణం కల్పించినట్లు వెల్లడించారు. ఇతర రూట్లలో సూపర్ లగ్జరీ, ఆపై బస్సుల్లో 10 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. రెండు, మూడు నెలల ఎంఎస్‌టీ టికెట్లకు వరుసగా ఐదు, పది రోజుల అదనపు గడువు కల్పించడంతో పాటు మహిళలకు 20 రోజుల బదులు 15 రోజుల ఛార్జీలే వర్తిస్తాయని తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు సమీప బస్ పాస్ కౌంటర్లను సంప్రదించాలని కోరారు.



నరేంద్రాచార్య స్వామి సభా ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు గ్రౌండ్ లో జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ నరేంద్రాచార్య వారి దర్శనం ఈ నెల 16 (సోమవారం) జరగనున్న దరిమిలా సభ మరియు మండప ఏర్పాట్లను కాగజ్ నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ తో కలిసి ఏర్పాట్లను పరివేక్షించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గం నుండే కాకుండా పక్కన ఉన్న ఆసిఫాబాద్ మరియు మహారాష్ట్ర నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని, వారందరికీ దర్శన ఏర్పాట్లతో పాటు పార్కింగ్ మరియు ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. జగద్గురువుల ఆశీస్సులు పొందడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ కుమార స్వామి, పీఠ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఎంఎస్టీ ప్రయాణికులకు కొత్త రాయితీలు

ఆర్ఎం విజయభాను

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 14 :

టీజీఎస్ఆర్టీసీ నెలవారీ సీజన్ టికెట్ (ఎంఎస్‌టీ) ప్రయాణికులకు సంస్థ పలు కొత్త సౌకర్యాలు, రాయితీలు కల్పించినట్లు రీజినల్ మేనేజర్ డి. విజయభాను తెలిపారు. నవంబర్ 14 నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఎంఎస్‌టీతో రూట్ పరిమితి లేకుండా ప్రయాణించవచ్చని, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఈ–టికెట్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్‌లో ఆదివారాల్లో ఉచిత ప్రయాణం కల్పించినట్లు వెల్లడించారు. ఇతర రూట్లలో సూపర్ లగ్జరీ, ఆపై బస్సుల్లో 10 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. రెండు, మూడు నెలల ఎంఎస్‌టీ టికెట్లకు వరుసగా ఐదు, పది రోజుల అదనపు గడువు కల్పించడంతో పాటు మహిళలకు 20 రోజుల బదులు 15 రోజుల ఛార్జీలే వర్తిస్తాయని తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు సమీప బస్ పాస్ కౌంటర్లను సంప్రదించాలని కోరారు.

తపాలాపూర్ లో మధుమేహ పరీక్షలు

జన్నారం,నవంబర్ 14 (వుదయం విలేఖరి)



మండలంలోని తపాలాపూర్ గ్రామంలో శనివారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో మధుమేహ పరీక్షలు మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచితంగా రక్తంలో చక్కెర (షుగర్) పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా 30 సంవత్సరాలు పైబడిన వారికి, వృద్ధులకు పరీక్షలు చేసి, షుగర్ ఎక్కువగా ఉన్నవారిని గుర్తించి పీహెచ్సీ కి రిఫర్ చేశారు.ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ, మధుమేహం అంటే ఏమిటి, టైప్–1 మరియు టైప్–2 మధుమేహం మధ్య తేడా, లక్షణాలు, కారణాలు గురించి వివరించారు.తరచుగా మూత్రం రావడం, ఎక్కువ దాహం, ఎక్కువ ఆకలి, నీరసం, గాయాలు ఆలస్యంగా మానడం, కాళ్ళలో తిమ్మిర్లు, కంటి చూపు మసకబారడం,ఉప్పు, నూనె, తీపి తగ్గించడం, రోజూ 30 నిమిషాలు నడక, వ్యాయామం, సమయానికి భోజనం, మందులు క్రమం తప్పకుండా వాడటం, మద్యం, పొగాకు మానేయడం వల్ల మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు.మధుమేహం ఉన్నవారు మందులు మానకుండా, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లలిత, విజయ, అంగన్వాడి కార్యకర్త కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొనకల్ ప్రాథమిక పాఠశాలలో చిల్డ్రన్ ఫ్రెండ్లీ గ్రామసభ



జన్నారం,నవంబర్ 14 (వుదయం విలేఖరి)

మండలంలోని పొనకల్ ప్రాథమిక పాఠశాలలో, జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి ఘనంగా బాలల గ్రామ సభను పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వారి హక్కులు, బాధ్యతలు, మంచి ఆరోగ్య అలవాట్లు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యత అంశాలను వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు, వారి ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ.ఐ –ఏఏక్స్ఎల్ కంప్యూటర్ ల్యాబ్ ను ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పల జలపతి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎన్. విజయకుమార్, చైర్ పర్సన్ మూల రేణుక, వార్డు మెంబర్లు అంజన్న, మొహ్సిన్, సుగుణ, సంతోష్, మహేందర్, పాఠశాల ఉపాధ్యాయులు కే. రాజేశం, కే. శ్రీకాంత్ మరియు బిల్ కలెక్టర్ అనిల్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ పరీక్షలు

దండేపల్లి నవంబర్ 14 (వుదయం విలేఖరి)



ప్రపంచ మధుమేహ దినోత్సవం(world Diabetes Day) ను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ దండేపల్లి ఆధ్వర్యంలో శనివారం దండేపల్లి బస్టాండ్ ఆవరణలో ఉచితంగా సుమారుగా 60 మంది గ్రామ ప్రజలకు మధుమేహ పరీక్షలు చేయించారు వీరిలో సుమారు 10 మందికి షుగర్ వ్యాధి ఉన్నట్టుగా నిర్ధారణ జరిగిందన్నారు అనంతరం షుగర్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా షుగర్ వ్యాధి ముందస్తు జాగ్రత్తలు తదితర విషయాలపై జాగ్రత్తలను సూచిస్తూ కరపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ బొలిశెట్టి రాజన్న సెక్రటరీ లయన్ కర్నె నరేందర్, కోశాధికారి లయన్ పోలంపల్లి రామరాజు, మాజీ అధ్యక్షులు లయన్ కొండు జనార్దన్.క్లబ్ సభ్యులు లయన్ ముత్తినేని రమేష్,లయన్ ఎనగందుల సత్యం పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



జన్నారం డిఎఫ్ఓ రామ్మోహన్

దండేపల్లి: నవంబర్ 14 (వుదయం విలేఖరి)

వన్యప్రాణులను వేటాడుతే కఠిన చర్యలు ఉంటాయని జన్నారం డిఎఫ్ఓ రామ్మోహన్ తెలిపారు శనివారం తాళ్ళపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జన్నారం అటవీ డివిజన్ పరిధిలో అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడం, ఉచ్చులు వేయడం, బల్లెములు,తుపాకులు లేదా ఇతర వేట ఆయుధాలను ఉపయోగించడం వంటి చర్యలకు పాల్పడితే తీవ్రమైన నేరాలు.నేర తీవ్రత మరియు సంబంధిత చట్ట నిబంధనల ఆధారంగా నేరస్థులకు 3 నుండి 7 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని మరియు విద్యుత్ చట్టం, 2003 ప్రకారం కేసులు నమోదు చేసి,కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

అంతేకాకుండా, వన్యప్రాణుల వేటకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించడం, ప్రోత్సహించడం,కుట్రలో భాగస్వాములు కావడం వంటి చర్యలు కూడా చట్టరీత్యా నేరాలు. వన్యప్రాణుల వేటకు సంబంధించి ఫోన్ కాల్స్ లేదా ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా వేటకు సహకరించినట్లు ఆధారాలతో నిరూపితమైతే,సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోబడతాయి.గతంలో జన్నారం అటవీ డివిజన్ పరిధిలో ఇటువంటి అక్రమ వేట కార్యకలాపాల కారణంగా వన్యప్రాణులు మృత్యువాత పడటమే కాకుండా,విద్యుత్ తీగల కారణంగా మనుషులు కూడా ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇటీవల తాళ్ళపేట రేంజ్, దండేపల్లి సెక్షన్,పాత మామిడిపల్లి బీట్ పరిధిలో వన్యప్రాణుల వేట కోసం కొంతమంది వ్యక్తులు విద్యుత్ తీగలు అమర్చడం వల్ల పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందిన విషాదకర సంఘటన కూడా చోటుచేసుకుంది. వన్యప్రాణులను వేటాడే ఉద్దేశంతో అమర్చిన విద్యుత్ తీగలు వన్యప్రాణులకే కాకుండా మనుషుల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పుగా మారుతున్నాయి. మరియు ఇట్టి విషయమై పోలీసు శాఖ తరపున కూడా భారతీయ న్యాయ సంహిత ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని

అదేవిధంగా,రైతులు తమ వ్యవసాయ పంటలను వన్యప్రాణుల నుండి రక్షించుకునే ఉద్దేశంతో పొలాల చుట్టూ ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ వైర్లు అమర్చరాదు. ఇటువంటి చర్యల వల్ల వన్యప్రాణులతో పాటు మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది. ఇటువంటి అక్రమ వేట కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో దండేపల్లి డిఆర్ఓ పి రాము,తాళ్లపేట డిఆర్ఓ సాగరిక, మహమ్మదాబాద్ ఎఫ్ఎస్ఓ అతావుల్లా,దండేపల్లి ఎఫ్బిఓ కృష్ణ,తాళ్లపేట ఎఫ్బిఓ రహీమొద్దీన్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా పథకం ద్వారా ప్రజా ప్రభుత్వం భరోసా

- పేద కుటుంబాలకు ఆర్థిక రక్షణ కవచంగా (ఐకేజేబిపి) 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'
- నవంబర్ 19న ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- జగిత్యాల జిల్లాలో సుమారు 2.85 లక్షల కుటుంబాలకు ఆర్థిక లబ్ది చేకూరేలా కార్యాచరణ
- అర్హుల గుర్తింపు పారదర్శక నమోదు ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి

జగిత్యాల నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లాలోని పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది కుటుంబానికి ఆధారంగా నిలిచే కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా అండగా నిలిచేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంను ప్రవేశపెడుతోంది కుటుంబ పెద్దను కోల్పోయిన విషాద సమయంలో ఆ కుటుంబం జీవనోపాధి కోసం ఇతరులపై ఆధారపడకుండా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు 5 లక్షల రూపాయల జీవిత బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం రూపొందించిన ఈ పథకం రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు భవిష్యత్తుపై నమ్మకాన్ని కల్పించనుంది మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.


జిల్లా లో నవంబర్ 19 నుంచి ప్రత్యేక నమోదు కేంద్రాలు

నవంబర్ 19న పథకం ప్రారంభమైన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు పట్టణాల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు ఈ కేంద్రాల ద్వారా అర్హులైన కుటుంబాల నుంచి వివరాలు సేకరించి నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందేలా విస్తృత స్థాయిలో నమోదు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో పట్టణ ప్రాంతాల్లో సంబంధిత మున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో సమన్వయంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నారు ప్రజలు నమోదు కేంద్రాలకు వచ్చినప్పుడు వారికి అవసరమైన సమాచారం అందించడంతో పాటు దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడం అధికారుల బాధ్యతగా ఉంటుంది కుటుంబ సభ్యులు ఎంచుకున్న బీమా పొందే వ్యక్తి వివరాలు నామినీ వివరాలు పంపిణీ నిష్పత్తి వంటి అంశాలను జాగ్రత్తగా నమోదు చేయాల్సి ఉంటుంది నమోదు పూర్తయిన తర్వాత వివరాలను మరోసారి పరిశీలించడం ద్వారా భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా చూడవచ్చు.

జగిత్యాల జిల్లాలో సుమారు 2.85 లక్షల కుటుంబాలకు జీవిత బీమా భరోసా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జగిత్యాల జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు జిల్లాలోని గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మొత్తం 2,83,458 కుటుంబాలకు పథకం వివరాలు చేరేలా కార్యాచరణ రూపొందించారు జిల్లాలోని 20 మండలాల పరిధిలో 385 గ్రామ పంచాయతీల ద్వారా 2,01,038 కుటుంబాలకు ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 136 వార్డుల ద్వారా 82,420 కుటుంబాలకు పథకంపై అవగాహన కల్పించనున్నారు గ్రామీణ పట్టణ ప్రాంతాలను కలిపి మొత్తం 521 గ్రామ పంచాయతీలు వార్డుల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు

నవంబర్ 14 నుంచి 18 వరకు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి కుటుంబానికి పథకం వివరాలు తెలియజేయనున్నారు నవంబర్ 19 నుంచి ప్రత్యేక నమోదు కేంద్రాల ద్వారా అర్హులైన కుటుంబాల వివరాలను సేకరించనున్నారు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ అర్హుల గుర్తింపు వివరాల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించనున్నారు.



మారుమూల గిరిజన గ్రామాలకు అభివృద్ధి బాట!

- తాళ్లపేట గూడ, అలిగూడలో రూ.14 లక్షలతో బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన
- మంగి గ్రామ పంచాయతీ సర్పంచ్ రాయిసీడం వినోద్ ముందడుగు

తిర్యాణి, నవంబర్ 14:



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి మంగి గ్రామ పంచాయతీ పాలక వర్గం మరో ముందడుగు వేసింది. మంగి గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్లపేట గూడ, అలిగూడ గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.7 లక్షల చొప్పున మొత్తం రూ.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న బ్రిడ్జిల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ రాయిసీడం వినోద్ శంకుస్థాపన చేశారు. చాలాకాలంగా ఈ గ్రామాల ప్రజలు రాకపోకల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగులు, నీటి ప్రవాహాల కారణంగా రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, రైతులు వ్యవసాయ పనుల కోసం బయటకు వెళ్లేందుకు, అత్యవసర సమయాల్లో వైద్య సేవలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను గుర్తించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు పూర్తయితే తాళ్లపేట గూడ, అలిగూడ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయి. మారుమూల గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ కనక శ్రీకాంత్, వార్డు సభ్యులు, గ్రామ పటేల్, తాళ్లపేట గూడ, అలిగూడ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

32 రోజుల పోరాటానికి తాత్కాలిక విరామం

ఆసిఫాబాద్, (వుదయం ప్రతినిధి)



సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గత 32 రోజులుగా ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జేఏసీ ప్రకటించింది. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ తెలిపింది. ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. ప్రభుత్వంపై నమ్మకంతో పాటు ప్రజలకు వైద్య సేవల్లో ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో సమ్మెను తాత్కాలికంగా విరమించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. అయితే ప్రభుత్వం నుంచి ఇంకా లిఖితపూర్వక హామీ అందలేదని జేఏసీ స్పష్టం చేసింది. తమ పోరాటానికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత డయాబెటిస్ వైద్య శిబిరం

జన్నారం,నవంబర్ 14 (వుదయం విలేఖరి)



మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత డయాబెటిస్ (మధుమేహం) వైద్య శిబిరాన్ని శనివారం ఉదయం లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ బండారి మారుతి రాజ్, రీజియన్ చైర్ పర్సన్ లయన్ జక్కు భూమేష్, జోన్ చైర్ పర్సన్ లయన్ మదంశెట్టి మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ శిబిరంలో ప్రజలకు మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.సమాజ సేవలో భాగంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ శిబిరంలో మల్యాల బాపన్న, వావిలాల రాజు, ప్రవీణ్ కుమార్, జాజాల శ్రీనివాస్, సతిష్ కుమార్, మల్లేశ్,తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



అయ్యప్ప స్వాములు, భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆసిఫాబాద్ డిపో మేనేజర్ కె.వి. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప స్వాములు తమ ప్రయాణాన్ని అత్యంత సురక్షితంగా, సౌకర్యవంతంగా కొనసాగించేందుకు సంస్థ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

బస్సు బుకింగ్ చేసుకున్న భక్తులకు సంస్థ నిబంధనల ప్రకారం ఒక గురుస్వామి, ఇద్దరు మణికంఠులు, ఇద్దరు వంట మనుషులు మరియు ఒక లగేజీ అటెండెంట్‌కు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల భక్తులు, గ్రూపులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల మరియు బుకింగ్ కోసం 9493282510, 8328021517, 9959226006 నంబర్లలో సంప్రదించగలరని డిపో మేనేజర్ కోరారు.

సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

మంచిర్యాల /రామకృష్ణాపూర్/నవంబర్ 14(వుదయం ప్రతినిధి)



రామకృష్ణాపూర్ సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల కోసం వివిధ ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చాటుకున్నారు. వివిధ కళా సాంస్కృతిక ప్రదర్శనలతో చిన్నారులు అలరించగా, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య బాలల దినోత్సవ వేడుకలు ఉల్లాసభరితంగా సాగాయి. చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఈదునూరి సారంగరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు. తోటి వారితో స్నేహభావంతో మెలుగుతూ, పెద్దల పట్ల గౌరవం, గురువుల పట్ల విధేయత కలిగి ఉండాలని తెలిపారు. అలాగే దైవభక్తి, నైతిక విలువలను జీవితంలో భాగంగా చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక వన మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ

- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో వన మహోత్సవాలది కీలకపాత్ర
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి) :



కార్తీక వన మహోత్సవాలు ఆధ్యాత్మికతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఆత్మీయత, అనుబంధాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం అర్బన్ అగ్రహారంలోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్తీక వన మహోత్సవానికి ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆంజనేయస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్తీక మాసం భక్తి, ఆధ్యాత్మిక చింతన, ధార్మిక సంప్రదాయాలకు విశేష ప్రాధాన్యత కలిగిన పవిత్ర మాసమన్నారు. ఈ మాసంలో నిర్వహించే వన మహోత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇలాంటి వేడుకలు సమాజంలో సద్భావనను పెంపొందించడంతోపాటు ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

గడువులోగా రాజన్న ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ప్రతి పనికి డెడ్‌లైన్ విధించాలి ప్రభుత్వ విప్ ఆది
- దేవాదాయ కమిషనర్, కలెక్టర్‌తో కలిసి పనుల పరిశీలన

వేములవాడ, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి) :



దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. పనుల జాప్యానికి తావు లేకుండా ప్రతి పనికి గడువు విధించి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సూచించారు. శనివారం భీమేశ్వర స్వామి ఆలయ అతిథిగృహంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ రాజేశ్వర్‌రెడ్డి, ఆర్కిటెక్ట్, ధార్మిక సలహాదారుతో కలిసి ఆది శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న నిర్మాణాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు,అనంతరం అధికారులతో కలిసి ఆలయ విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని సమీక్షించి, పనుల వేగం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. పనులకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి, నిర్దేశిత గడువులోగా నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి పనిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, స్థపతులు జయేంద్రన్, గణేష్, స్ట్రక్చరల్ ఇంజినీర్ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం.. కార్తీక వనమహోత్సవంలో చల్మెడ సందడి

వేములవాడ, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి) :



పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అగ్రహారంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్తీక వనమహోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆర్యవైశ్య సోదరులతో కలిసి వనభోజన కార్యక్రమంలో పాల్గొని ఆత్మీయంగా ముచ్చటించారు. కార్తీక మాసంలో ఇలాంటి సామూహిక వనభోజన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సోదరభావం, ఐక్యతతో పాటు పరస్పర ఆత్మీయ అనుబంధాలు మరింత బలపడతాయని చల్మెడ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, ముత్త మహేష్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నాయకులు నీలం శేఖర్, లైశెట్టి మల్లేశం, జంగిటి సంజీవ్, ప్రేమ్ చారి, ఆర్యవైశ్య నాయకులు మాడిశెట్టి కృపాల్, చేపూరి రవీందర్, పైడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు : చందనోత్సవం సందర్భంగా ఆర్జిత సేవలు, వాహన పూజలు, వి.ఐ.పి. దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేత

మల్యాల మండలం నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల జిల్లా మల్యాల మండలం శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము, కొండగట్టు నందు శ్రీ స్వామి వారి చందనోత్సవం– మహా సంప్రోక్షణ కార్యక్రమాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తేదీ 15.11.2026 నుండి 20.11.2026 వరకు దేవస్థానంలో నిర్వహించబడే అన్ని ఆర్జిత సేవలు మరియు వాహన పూజలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈవో అంజనారెడ్డి తెలిపారు. అదేవిధంగా, చందనోత్సవం సందర్భంగా శ్రీ స్వామి వారి మూలవిరాట్టు దర్శనాలు భక్తులకు అందుబాటులో ఉండవు. భక్తుల దర్శనార్థం బాలాలయం ఏర్పాటు చేసి అక్కడ దర్శన సౌకర్యం కల్పించబడుతుంది. వి.ఐ.పి. దర్శనాలు, కూడా తాత్కాలికంగా నిలిపివేయబడతాయి. మరియు సిఫారసు లేఖలు కూడా పరిగణలోకి తీసుకొనబడవు.

తిరిగి తేదీ 21.11.2026 నుండి అన్ని ఆర్జిత సేవలు మరియు వాహన పూజలు యథావిధిగా కొనసాగించబడతాయి. మరియు శ్రీ స్వామి వారి నిజరూప దర్శనము భక్తులకు కల్పించబడును. కావున భక్తులు ఈ విషయాన్ని గమనించి, దేవస్థాన అధికారులకు సహకరించగలరని ఈవో కోరారు.

కొమురయ్య గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ముత్తారం నవంబర్ 14(వుదయం ప్రతినిధి):



రామగిరి మండలం రామయ్యపల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆరెల్లి కొమురయ్య గౌడ్ మాతృమూర్తి ఆరెల్లి గట్టుమల్లు ఇటీవల మృతి చెందారు.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమురయ్య గౌడ్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ గట్టుమల్లు మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం కొమురయ్య గౌడ్ కుటుంబ సభ్యులను ఓదార్చి,ఈ కష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు.గట్టుమల్లు మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో అడవి శ్రీరాంపూర్ ఉపసర్పంచ్ అనవేని హరిత తిరుపతి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్కం ప్రభాకర్,గట్టు సదయ్య,వార్డు సభ్యుడు వీరబోని అజయ్ పలువురు కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



దామ అంజి వైద్యానికి రూ.2.50 లక్షల ఎల్ఓసీ

ముత్తారం నవంబర్ 14(వుదయం ప్రతినిధి):

ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్‌కు చెందిన దామ అంజి వైద్య ఖర్చుల కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు.అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంజి కుటుంబ సభ్యులు మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపట్టారు.మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన సిబ్బంది బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సాయంపై అంజి కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



కేజీబీవీలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ముత్తారం నవంబర్ 14(వుదయం ప్రతినిధి):

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి జి. స్వప్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థినుల్లో ఆనందోత్సాహాలు నింపేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పిల్లల సంతోషమే దేశ భవిష్యత్తుకు పునాది అని, ప్రతి విద్యార్థిని విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.విద్యార్థినుల ఉత్సాహం,సంతోషం మధ్య వేడుకలు ఘనంగా ముగిశాయి.



తక్కళ్లపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

మల్యాల మండలం నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)

మల్యాల మండలం తక్కళ్లపల్లి సింగిల్ విండో పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ శోభ, లంబాడిపల్లి, తాటిపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మనాల సర్పంచ్ లు మరాఠీ సంధ్య సత్తయ్య,మేటుపల్లి లత, చికట్ల లత, గాతం అంజయ్య, బల్మూరి పాపారావు లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని , దళారులను నమ్మి మోసపోవద్దు అని అన్నారు.ఈ కార్యక్రమం లో దొంగ ఆనంద రెడ్డి, పాక్స్ డైరెక్టర్లు సుల్తాన్ లచ్చన్న రంగు తిరుపతి గౌడ్ , తూకుంట్ల నరసింహారెడ్డి అన్నారెడ్డి నరసయ్య , ఉపసర్పంచ్ లక్ష్మణ చారి, వినోద్ గౌడ్, మల్లేష్ యాదవ్ ముత్యాల నరసింహారెడ్డి గుర్రం వెంకన్న దిండు ప్రవీణ్, భాస్కరరావు శంకర్ గౌడ్ రైతులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేపట్టాలి

- సర్వే వివరాలపై ముందుగానే అవగాహన కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం
- జయవరంలో రీసర్వే ప్రక్రియ పరిశీలన

వేములవాడ రూరల్, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి) :



భూముల రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సర్వేకు సంబంధించి రైతులకు ముందస్తు సమాచారం అందించి, వారి భూముల వివరాలను తెలియజేస్తూ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. వేములవాడ రూరల్ మండలం జయవరంలో శనివారం కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ యంత్రాలు, ఆధునిక డిజిటల్ పరికరాలతో చేపడుతున్న సర్వే తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు రీసర్వేపై ముందస్తు సమాచారం అందించాలని తెలిపారు. సర్వే విధానం, దాని ప్రాధాన్యతపై గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి, భూముల వివరాలను వారికి తెలియజేసిన అనంతరం సంతకాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రీసర్వే ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, సంక్షేమంపై ప్రత్యేక గ్రామసభ

ముత్తారం నవంబర్ 14(వుదయం ప్రతినిధి):



బాలల హక్కుల పరిరక్షణ,చిన్నారులకు పౌష్టికాహారం,మెరుగైన ఆరోగ్యం, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా హరిపురం గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ముత్తారం మండలంలోని హరిపురం అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ మెంగని సమత తిరుపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బాలలే దేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం,పౌష్టికాహారం అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.చిన్నారుల ఎదుగుదలలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.పిల్లల పౌష్టికాహారం,ఆరోగ్య పరిరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బాలల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కూస తిరుపతి, వార్డు సభ్యురాలు యార సునిత రాజిరెడ్డి, అంగన్వాడీ టీచర్ శ్రీపెల్లి సరోజన, గ్రామ కార్యదర్శి నవ్య, అంగన్వాడీ ఆయా అనూషతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతలపై పోలీసుల అవగాహన

ముత్తారం నవంబర్ 14(వుదయం ప్రతినిధి) :



రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా,ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు ముత్తారం పోలీసులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలోని కాసార్ల గడ్డ సమీపంలో శనివారం ఎస్సై ఎన్. రవికుమార్ ఆధ్వర్యంలో ఏఎస్సై చంద్రమౌళి వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనదారులు అతివేగానికి దూరంగా ఉండాలని,ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడరాదని,ట్రాఫిక్ సంకేతాలు,రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,మన జాగ్రత్తే మన కుటుంబానికి రక్షణ అని పేర్కొన్నారు.ప్రజలు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకొని ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ అశోక్, వెంకట్ రెడ్డి, రమేష్, ఓంగార్డ్ రాజు తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరిపురంలో సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు



పీఎం సూర్య ఘర్ పథకంపై గ్రామస్తులకు అవగాహన

ముత్తారం నవంబర్ 14(వుదయం ప్రతినిధి):

సోలార్ విద్యుత్ వినియోగం, కేంద్ర ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణ సదుపాయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం హరిపురంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు.సర్పంచ్ మేంగాని సమత తిరుపతి ఆధ్వర్యంలో కేకే ఎంటర్‌ప్రైజెస్,ఎస్‌బీఐ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా కేకే ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులు పి. శివతేజ, జి.కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకం కింద అర్హులకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని వివరించారు.సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఎస్‌బీఐ ద్వారా రుణ సదుపాయం ఉందని, గృహ అవసరాలకు అనుగుణంగా 3 నుంచి 10 కిలోవాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.ఎస్‌బీఐ అధికారులు రుణ విధానం,వడ్డీ,అర్హతల వివరాలను వెల్లడించారు.సర్పంచ్ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు గ్రామస్తులు సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.అనంతరం గ్రామస్తుల సందేహాలను నివృత్తి చేసి, అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కూస తిరుపతి, ఎస్‌బీఐ అధికారులు, కేకే ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేకుండానే ఈద్గా వద్ద రిటైనింగ్ గోడ నిర్మాణానికి యత్నం

- **తక్షణమే విచారణ జరపండి**
- **దోషులపై కఠిన చర్యలు తీసుకోండి**
- **జిల్లా అదనపు కలెక్టర్, కమిషనర్ లకు బీజేపీ కార్పొరేటర్ల ఫిర్యాదు**

కరీంనగర్ నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేకుండానే ఈద్గా వద్ద రిటైనింగ్ వాల్ కట్టి, మొక్కలు నాటి మత విద్వేషాలు రగిలించాలనికుట్ర చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ కార్పొరేటర్లు ఈరోజు జిల్లా అదనపు కలెక్టర్ అశ్వనీ తానాజీ వాకడే, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ను కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు ఉన్న ఈద్గా వద్ద కొందరు వ్యక్తులు మూడు రోజుల క్రితం (2026 నవంబర్ 11న) రిటైనింగ్ వాల్ కట్టేందుకు కంకర, ఇసుకను తీసుకొచ్చి జేసీబీతో పనులు ప్రారంభించారని ఫిర్యాదు చేశారు. అక్కడే మొక్కలు నాటాలని యత్నించారని పేర్కొన్నారు. ఈ పనులకు మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేదని, కనీసం అనుమతి కూడా కోరలేదని గుర్తు చేశారు. హిందూ, ముస్లిం వర్గాల మధ్య మత విద్వేషాలు రగిలించి గొడవలు సృష్టించేందుకు కుట్ర చేసినట్లు కన్పిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేత హస్తం ఉన్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు.తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేసి కరీంనగర్ లో గొడవలు సృష్టించి విద్వేషాలు రగిలించి బీజేపీని బదనాం చేయడమే లక్ష్యంగా సదరు వ్యక్తులు ఈ కుట్రకు తెరదీసినట్లు ఆరోపించారు.

వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని ఏ ఉద్దేశంతో ఈ కుట్రకు తెరదీశారో సమగ్ర విచారణ జరపాలని కోరారు. మత విద్వేషాలు రగిలించి కరీంనగర్ లో అల్లర్లు సృష్టించాలని కుట్ర చేసిన వ్యక్తులపై తక్షణమే నాన్ బెయిలెబుల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. ప్రశాంత



మైన కరీంనగర్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంఛార్జ్, కార్పొరేషన్ విప్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ శ్రీను, ఉప్పరపల్లి శ్రీనివాస్ తదితరులు అదనపు కలెక్టర్, పోలీస్ కమిషనర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

కేరళ హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు



కోరుట్ల నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)

భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నవంబర్ 14న దేశ వ్యాప్తంగా బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్నాం ఈ సందర్భంగా కోరుట్ల పట్టణం లోని కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి ఈ కార్యక్రమంలో నర్సరీ నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాటలు నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు అందరినీ అలరించారు ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ వినియోగం మొబైల్ ఫోన్ల దుర్వినియోగం ఆన్‌లైన్ గేమ్స్ సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలపై విద్యార్థులు ఉపన్యాసాలు నాటికల ద్వారా చక్కటి సందేశాన్ని అందించి అందరి ప్రశంసలు పొందారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సెలెన్ బారి మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్నతనం నుండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని పెద్దలు గురువులు చూపిన మార్గంలో నడుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు తద్వారా తల్లిదండ్రులకు గురువులకు పాఠశాలకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు పాఠశాల కరస్పాండెంట్ ఎంఏ బారి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని పేర్కొన్నారు పిల్లల మనసులు కల్మషం లేనివని అందుకే బాలలంటే భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఎంతో ఇష్టమని ఆయన జన్మదినమైన నవంబర్ 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు నేటి సమాజంలో విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న డ్రగ్స్ మొబైల్ ఫోన్లు ఆన్‌లైన్ గేమ్స్ సామాజిక మాధ్యమాలకు చిన్నతనం నుండే దూరంగా ఉండాలని సూచించారు విలువైన సమయాన్ని సామాజిక మాధ్యమాల్లో వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని తమ లక్ష్య సాధన కోసం కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని పిలుపునిచ్చారు ప్రతి విద్యార్థి మంచి పౌరుడిగా ఎదిగి తల్లిదండ్రులకు గురువులకు పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావడంతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడాలని సందేశమిచ్చారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎంఏ బారి ప్రిన్సిపల్ సెలెన్ బారి చైర్మన్ ఎంఏ హాది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు విద్యార్థులలో ఆనందోత్సాహాలను నింపుతూ మంచి నడవడిక క్రమశిక్షణ సామాజిక బాధ్యతల పట్ల అవగాహన కల్పించిన ఈ బాలల దినోత్సవ వేడుకలు ముగిశాయి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయలు

కోరుట్ల మండలం మాదాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం

కోరుట్ల నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామ శివారులో శనివారం గోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న యువకుడు అక్కడిక్కక్కడే మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్ గ్రామానికి చెందిన డోంకేశ్వరి ప్రశాంత్ (24) గడ్డం నవీన్ ద్విచక్ర వాహనం పై కోరుట్ల నుంచి తమ స్వగ్రామమైనా మాదాపూర్ వెళుతుండగా మాదాపూర్ శివారులో ఎదురుగా వచ్చిన బస్ వారి బైక్ ను డి కొట్టింది ఈ ప్రమాదం లో ప్రశాంత్ తలకు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు నవీన్ కు తీవ్ర గాయాలయ్యాయి గాయపడిన నవీన్ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు కాగా ప్రమాద స్థలానికి సమీపంలో పొలంలో వరి కొయ్యలు కాల్చడంతో వెలువడిన పొగ రహదారిని కమ్ముకకోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు పొగ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుని ఉండవచ్చునని అనుమానిస్తున్నారు ఈ ఘటన తో మాదాపూర్ గ్రామం లో విషాద ఛాయలు అలుముకున్నాయి.





అర్హులైన వారికి కొత్త పెన్షన్ పత్రాల పంపిణీ

20వ వార్డులో లబ్ధిదారులకు అందజేసిన కౌన్సిలర్ కుమ్మరి శంకర్

వేములవాడ, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి) :

వేములవాడ పట్టణంలోని 20వ వార్డులో కొత్తగా మంజూరైన ఆసరా పెన్షన్ పత్రాలను శనివారం పంపిణీ చేశారు. 20వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి శంకర్ లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మగ్గిడి,దోంతాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధర్మపురి నవంబర్14(వు దయం ప్రతినిధి):

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని జైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సౌళ్ల.నరేష్ ఆధ్వర్యంలో మగ్గిడి, దోంతపూర్ గ్రామాల్లో పరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచిం చారు.గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461 మద్దతు ధరతో పాటు సన్న రకం ధా న్యానికి రూ.500 బోనస్ అం దజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు తాడుక తిరుపతి, చిగిరి జలపతి,సముద్రాల సత్తయ్య, గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులు, నాయకులు, రైతులు, పీఏసీఎస్ జైన సీఈఓ బల్మూరి సాగర్‌రా వు తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఏసీపి ప్రశాంత్ రెడ్డి

ధర్మసాగర్ నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)

ఈరోజు వార్షిక తనిఖీలో భాగంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి. ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను, క్రైమ్ రేటును క్షుణ్ణంగా పరిశీలించి, పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై, సీఐ,ఎస్ఐ కి మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి అక్రమ రవాణా మరియు వినియోగం, సైబర్ నేరాలు సిబ్బంది వారి వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని మరియు అసాంఘిక కార్యకలాపాల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించే విధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.



ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

మెట్ పల్లి నవంబర్ 14 (వుదయం విలేకరి)

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలోని వెంకట్ రెడ్డి గార్డెన్స్‌లో జాబ్ మేళాను నిర్వహించారు.ఈ జాబ్ మేళాకు 1,500 మందికి పైగా నిరుద్యోగ యువత విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు కేవలం విద్యను అందించడం మాత్రమే కాకుండా యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు ఈ జాబ్ మేళా ద్వారా సుమారు 750 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని ఎమ్మెల్యే వెల్లడించారు హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు యువత ఉద్యోగాల కోసం ఇతర పదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా స్థానికంగానే ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహించి వారికి అండగా నిలుస్తామని తెలిపారు యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు నియోజకవర్గ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు.







ఐజలో రేపు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

ఐజ, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)



ఐజలో రేపు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నారు. బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్య బృందం ఈ శిబిరాన్ని ప్రకటించింది. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స మరింత సులభమవుతుందని వైద్య బృందం తెలిపింది. ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుంది. ఐజ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ శిబిరం నిర్వహించనున్నారు. లక్షణాలు కనిపించకపోయినా ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఈ పరీక్ష చేస్తారు. 30 ఏళ్లు పైబడిన మహిళలు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. పొగాకు, మద్యం వినియోగించే వారు కూడా ఈ పరీక్షలకు హాజరుకావాలి. కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, శరీరంలో అసాధారణ లక్షణాలు గుర్తించినవారూ పరీక్షలు చేయించుకోవాలి. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

నర్సాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

నర్సాపూర్, నవంబర్ 15 (వుదయం టైమ్స్ ప్రతినిధి):



నర్సాపూర్ పట్టణ పరిధిలోని న్యూ క్లాసిక్ గార్డెన్స్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మెదక్ పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహమ్మద్ తాహెర్ (54) అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన కుమారుడితో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, మహమ్మద్ తాహెర్ తన కుమారుడు ఖాజా మొయినుద్దీన్ (19)తో కలిసి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తున్నారు. రాత్రి 11:15 గంటల సమయంలో గార్డెన్స్‌కు సుమారు 30 మీటర్ల దూరంలో గుర్తుతెలియని కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఆ కారు నర్సాపూర్ నుంచి సంగారెడ్డి వైపు అతివేగంగా వెళ్తోంది. ద్విచక్ర వాహనం నడుపుతున్న ఖాజా మొయినుద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదుపుతప్పిన కారు కొద్దిదూరంలో వస్తున్న మరో ద్విచక్ర వాహనం (టీఎస్35బీ9507)ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రామచంద్రాపురం గ్రామానికి చెందిన చిగురు ప్రదీప్ (27), తలారి నవీన్ (27) తీవ్రంగా గాయపడ్డారు.

నెహ్రూ నాటిన అభివృద్ధి విత్తనాలే నేడు మహావృక్షాలు

సంగారెడ్డి, నవంబర్ 14:వుదయం



మెదక్ జిల్లా సంగారెడ్డిలో నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నవంబర్ 14న ఐబీ జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం సవాళ్లతో ఉన్న దేశాన్ని నెహ్రూ అభివృద్ధి పథంలో నడిపించారని జగ్గారెడ్డి అన్నారు. నెహ్రూ నాటిన అభివృద్ధి విత్తనాలే నేడు మహావృక్షాలుగా ఎదిగాయని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యారంగాల అభివృద్ధికి నెహ్రూ విశేష కృషి చేశారని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ఐఐటీల ఏర్పాటుతో దేశాభివృద్ధికి బాటలు వేశారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు న్యాయ వ్యవస్థ పటిష్టతకూ ఆయన కృషి చేశారని అన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు.. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

సంగారెడ్డి, నవంబర్ 14:-వుదయం



సంగారెడ్డిలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. పుస్తక పఠనంతో విజ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని అంజయ్య అన్నారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలు మాత్రమే కాదని, విజ్ఞాన కేంద్రాలని చెప్పారు. పుస్తక పఠనం ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను, సమాజంపై అవగాహనను పెంచుతుందని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠన ప్రాధాన్యత తగ్గలేదని అంజయ్య స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లకే పరిమితం కాకుండా మంచి పుస్తకాలు చదవాలని పిలుపునిచ్చారు.

రాజానెల్లిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

కోహీర్, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):



రాజానెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోహీర్ మండల పరిధిలోని ఈ వేడుకలను గ్రామ సర్పంచ్ అమృతప్ప పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. సర్పంచ్ అమృతప్ప పాటిల్ మాట్లాడుతూ చిన్నారులే దేశ భవిష్యత్తు అని అన్నారు. వారి అభివృద్ధిపైనే సమాజం, దేశ ప్రగతి ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, భద్రతతో కూడిన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం విద్యార్థులకు సర్పంచ్ అమృతప్ప పాటిల్ బహుమతులు అందజేశారు. మిఠాయిలు పంపిణీ చేసి చిన్నారులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల చిరునవ్వులే సమాజ ఆనందానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

చిన్నారుల సమస్యలపై స్పందించిన సర్పంచ్

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి) , నవంబర్ 14, వుదయం:



బాలల దినోత్సవం సందర్భంగా ధర్మారం గ్రామంలో చిన్నారులతో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభను సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యమని తెలిపారు. ఇదే సందర్భంగా భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను కూడా ఘనంగా నిర్వహించారు. గ్రామసభలో సర్పంచ్ శ్రీనివాస్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులకు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని కూడా విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ఆటలు నిర్వహించాలని సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు తెలిపిన సమస్యలపై సర్పంచ్ శ్రీనివాస్ వెంటనే స్పందించారు. పాఠశాలలో అవసరమైన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజేష్‌ను ఆదేశించారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం

గద్వాల, నవంబర్ 14 (వుదయం బ్యూరో)



జోగులాంబ గద్వాల జిల్లాలో శనివారం పర్యటించిన హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్‌కు జిల్లా అధికార యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ఎర్రవల్లి మండలంలోని పదో బెటాలియన్ అతిథి గృహం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి, ఇతర అధికారులు కూడా ఈ స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు. అతిథి గృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న న్యాయమూర్తి పుల్ల కార్తీక్ పూడూరు గ్రామ రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న జిల్లా కోర్టు సముదాయాల నూతన భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత భవన నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను అధికారులు న్యాయమూర్తికి వివరించారు. కోర్టు సముదాయాల నిర్మాణానికి సంబంధించిన అంశాలను ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు, సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి పాల్గొన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిష్మా పాత్రుడు కూడా హాజరయ్యారు.

సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు


సంగారెడ్డి, నవంబర్ 14 (వుదయం):



ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థుల సందడి మధ్య బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో శనివారం ఈ వేడుకలు నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల స్వాగత నృత్యగీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ ఈ. సలోమోన్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ ఈ. జయ బాల రెడ్డి, డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అకాడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈ. అరుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎల్. ప్రదీప్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అనుగుణంగా నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

బాలల గ్రామసభలు నిర్వహించడం సరే.. సమస్యలకు పరిష్కారాలేవి?


మిరుదొడ్డి, నవంబర్ 14 వుదయం:



మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో నిర్వహించిన బాలల గ్రామసభలో ఉప సర్పంచ్ రాజు మాట్లాడారు. బాలల గ్రామసభలు నిర్వహిస్తున్నామని ప్రచారం చేసుకోవడం మాత్రమే సరిపోదని ఆయన స్పష్టం చేశారు. ఆ సభల్లో చిన్నారులు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం చూపడమే ప్రభుత్వానికి అసలైన బాధ్యత అని అన్నారు. పిల్లలతో సమస్యలు చెప్పించి, తీర్మానాలు చేసి, వాటిని కాగితాలకే పరిమితం చేస్తే సభల లక్ష్యం నీరుగారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నామమాత్రంగా గ్రామసభలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తీర్మానాలకే పరిమితం కావడం వల్ల సభల ఉద్దేశం నెరవేరదని హెచ్చరించారు. గత రెండు నెలల క్రితం నిర్వహించిన బాలల గ్రామసభలో విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కార గడువు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఆ సమస్యల అమలుపై సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తూ సమాధానం చెప్పాలని కోరారు. ప్రభుత్వం నిధులు కేటాయించి అమలు చేయాలని ఉప సర్పంచ్ రాజు పేర్కొన్నారు. బాలల గ్రామసభల్లో వచ్చిన సమస్యల్లో ఎన్ని పరిష్కారమయ్యాయో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఎంపీఓ హెచ్చరికలు బేఖాతర్


గద్వాల, నవంబర్ 14 (వుదయం కరస్పాండెంట్)



పుస్తక పఠనం మనిషికి విజ్ఞానాన్ని అందించడంతో పాటు ఆలోచనా శక్తిని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. రిటైర్డ్ ఎం.ఈ.ఓ. బస్వరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం సరస్వతీ దేవి, భారత తొలి ప్రధానమంత్రి చాచా నెహ్రూ, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞాన, సాహిత్య సంబంధిత పుస్తకాలను కూడా చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా కొత్త విషయాలను తెలుసుకోవడంతో పాటు మంచి ఆలోచనలు, ఉన్నతమైన విలువలు అలవడతాయని ఆయన పేర్కొన్నారు. సమాజంలో పఠన సంస్కృతిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ తిమ్మప్ప స్వామిపై నూతన భక్తి గీతం పోస్టర్ ఆవిష్కరణ


మల్దకల్ నవంబర్ 14 (వుదయం కరస్పాండెంట్)



మల్దకల్ తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన నూతన భక్తి గీతం పోస్టర్‌ను శనివారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ గీతానికి మల్దకల్ తిమ్మప్ప స్వామి గోవిందా అనే పేరు పెట్టారు. తొలి పోస్టర్‌ను సీఐ టంగుటూరి శ్రీనివాసులు, మల్దకల్ ఎస్సై శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. అధికారులు మాట్లాడుతూ, స్వామి వైభవాన్ని, ఆధ్యాత్మిక విశిష్టతను చాటిచెప్పేలా గీతాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఈ గీతం మరింత భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుందని ఆకాంక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ, పూర్తి భక్తి గీతాన్ని త్వరలోనే టీఎస్10 న్యూస్ ఛానల్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ గీతం రూపకల్పనలో బృంద సభ్యులు లక్ష్మణ్, హరిణ్, నరసింహ, విజయ్ పాల్గొన్నారు. కృష్ణ, మొబైల్ షాప్ విజయ్, డీజే వీరన్న, మీసేవ సిద్ధు సహకారం అందించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బృంద సభ్యులు లక్ష్మణ్, హరిణ్, నరసింహ, విజయ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గురుజువాడలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు


కోహీర్ నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):



గురుజువాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలానికి చెందిన ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నవంబర్ 14న జరిగిన ఈ వేడుకల్లో చిన్నారులతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో ఆనందోత్సాహాలు నింపారు. సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మాట్లాడుతూ చిన్నారులే దేశ భవిష్యత్తు అని అన్నారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, రక్షణతో కూడిన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. బాలల హక్కులను కాపాడుతూ వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల చిరునవ్వులే సమాజ అభివృద్ధికి నిదర్శనమని సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆకాంక్షించారు. వారి ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆనంద్ కుమార్, ఆయాలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చతుర్వేద టాలెంట్ స్కూల్ లో ఘనంగా బాలల దినోత్సవం


దౌల్తాబాద్ నవంబర్ 14(వుదయం):



దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలోని చతుర్వేద టాలెంట్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకు చిత్రలేఖనం, వ్యాసరచనతో పాటు పలు సాంస్కృతిక పోటీలు జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు జంగం శంకర్ బహుమతులు అందజేసి అభినందించారు. దేశ స్వాతంత్ర్యం కోసం సమరయోధులు ప్రాణత్యాగం చేశారని ఆయన గుర్తుచేశారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రతో పాటు హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తీరుపై అవగాహన పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు.

దౌల్తాబాద్‌లో ఘనంగా బాల గ్రామసభ.. చిన్నారుల హక్కులు, భవిష్యత్తుపై చర్చ


దౌల్తాబాద్ నవంబర్ 14 (వుదయం):



దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బాల గ్రామసభ నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, బాలల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ సభ జరిగింది. సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం సాగింది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సర్పంచ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బాలల అభివృద్ధిలో గ్రామపంచాయతీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజల భాగస్వామ్యం అవసరమని ఆమె పేర్కొన్నారు. పిల్లలే దేశ భవిష్యత్తు, రేపటి సమాజ నిర్మాతలని సర్పంచ్ అనురాధ రమేష్ అన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, పోషకాహారం కల్పించాలని సూచించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మూడు గ్రామాల లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


ఐజ, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి)



ఐజ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఏఐసీసీ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జరిగింది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడే సాబ్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ నిర్వహించారు. ఉప్పల, పులికల్, ఎక్లాస్‌పూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం రూ.70 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సహాయ నిధి మంజూరుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ నరసింహులు, సర్పంచులు తిమ్మోతి, దేవరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఐజ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలలో భాగంగా నిర్వహించబడింది.

ఆపదలో ఉన్న కుటుంబానికి సామాజిక బాధ్యత బృందం ఆర్థిక చేయూత


గద్వాల, నవంబర్ 14 (వుదయం బ్యూరో)



జోగులాంబ గద్వాల పట్టణానికి చెందిన జహంగీర్ కుటుంబానికి గద్వాల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ టీమ్ ఆర్థిక సహాయం అందించింది. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన సామాజిక బాధ్యత అని టీమ్ నిరూపించింది. మొత్తం రూ.45 వేల విలువైన సహాయాన్ని బృందం అందించింది. జహంగీర్ వాహనానికి కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. అయితే ఈ ఏడాది జనవరిలో గుండెపోటుతో ఆయన ఆకస్మికంగా మరణించారు. దీంతో భార్య హసీనా, ఇద్దరు కుమార్తెలు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. కుటుంబ పోషణతో పాటు పెద్ద కుమార్తె పాఠశాల ఫీజు చెల్లించడం కూడా భారంగా మారింది. హసీనా తమ కుటుంబ పరిస్థితిని బృంద సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. కుమార్తె చదువుకు ఆర్థిక సహాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బృంద సభ్యులు స్పందించి కుటుంబానికి అండగా నిలిచారు. ఇందులో రూ.35,000 నగదు సహాయంతో పాటు రూ.10,000 విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు.

తండ్రికి తలకొరివి పెట్టిన పెద్ద కుమార్తె

దౌల్తాబాద్ నవంబర్ 14(వుదయం):



దౌల్తాబాద్‌కు చెందిన గజవిన్కర్ విజయ్ కుమార్ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలే సంతానం. కుమారుడు లేకపోవడంతో తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించే బాధ్యతను పెద్ద కుమార్తె శ్రీనిధి స్వీకరించింది. శనివారం జరిగిన అంత్యక్రియల్లో శ్రీనిధి తండ్రికి తలకొరివి పెట్టి తుది వీడ్కోలు పలికింది. కన్నతండ్రిని కోల్పోయిన బాధను దిగమింగుకుంటూ ఆమె చూపిన ధైర్యం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. సంప్రదాయాలు, ఆచారాలకు అతీతంగా ఆమె నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చూసి పలువురు భావోద్వేగానికి గురయ్యారు. సాధారణంగా హిందూ సంప్రదాయం ప్రకారం కుమారుడే అంత్యక్రియలు నిర్వహించి తలకొరివి పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. మగ సంతానం లేని కుటుంబాల్లో కుమార్తెలే ముందుకొచ్చి తల్లిదండ్రులకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న ఘటనలు మారుతున్న ఆలోచనా విధానానికి అద్దం పడుతున్నాయి. ఆడపిల్లలు తల్లిదండ్రులకు ఏ మాత్రం తీసిపోరని శ్రీనిధి నిరూపించింది.

విష్ణు ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు


హత్నూర వుదయం ప్రతినిది :



హత్నూర ఉదయం ప్రతినిధి ప్రకారం, బీవీఆర్ఐటీ ప్రాంగణంలోని విష్ణు ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి, ఉపాధ్యాయులు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బీవీఆర్ఐటీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, జనరల్ మేనేజర్ బాపిరాజు, ఏవో సురేష్ పాల్గొన్నారు. వారు విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు


దౌల్తాబాద్ నవంబర్14(వుదయం):



దౌల్తాబాద్‌లోని నాల్గవ అంగన్వాడీ కేంద్రంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలు జరిగాయి. చిన్నారుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. నెహ్రూ పిల్లల పట్ల ప్రత్యేక ప్రేమాభిమానాలు చూపారు. ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చిన్నారులకు మంచి విద్య, పోషకాహారం, ఆరోగ్యం, సంరక్షణ అందించాలని అధికారులు పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అంగన్వాడీ ఉపాధ్యాయురాలు ప్రతిభ, ఆయా లక్ష్మి తదితరులు కూడా హాజరయ్యారు.

బాలలే రేపటి భవిష్యత్తు..

వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (నవంబర్ 14)



తెల్లాపూర్ ప్రతినిధి ప్రకారం, నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా ఉస్మాన్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తెలంగాణ వాణి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్ రావు హాజరయ్యారు. ఆయన చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడుతూ కొంతసేపు వారితో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటామని ఆయన వివరించారు. పిల్లలంటే చాచా నెహ్రూకు ఎంతో ప్రేమాభిమానాలని చిన్నారులకు చెప్పారు. బాలలే దేశ భవిష్యత్తు అని ఆయన పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మంచి భవిష్యత్తు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్యామ్ రావు తెలిపారు.

వుదయం


ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూస్తున్న చేయూత పెన్షన్ల పంపిణీ నేడే. మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత



ఖానాపురం, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

ఖానాపురం, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి): మండల ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చేయూత పెన్షన్ల పంపిణీ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు జరగనుంది. నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్లు అందజేయనున్నారని మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం మండల కేంద్రంలోని లక్ష్మీ దుర్గ ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. ఎంపీడీవో మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 505 చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని చెప్పారు. మిగిలిన పెన్షన్లు త్వరలోనే మంజూరవుతాయని లబ్ధిదారులకు తెలియజేశారు. మండల గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అందరూ సమయానికి హాజరు కావాలని అధికారులు సూచించారు. మండల ప్రజలు ఈ పంపిణీ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు.

లిటిల్ స్టార్ హై స్కూల్ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



నారాయణపేట టౌన్ నవంబర్ 14(వుదయం ప్రతినిధి)

నారాయణపేట టౌన్ నవంబర్ 14 (ఉదయం ప్రతినిధి) పట్టణంలోని లిటిల్ స్టార్ హైస్కూల్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పి. ఉమామనోహర్ గౌడ్, అడ్వైజర్ పి. సతీష్ కుమార్ గౌడ్ (అడ్వకేట్) విద్యార్థులను అభినందించారు. ఉమామనోహర్ గౌడ్ మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని అన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి సత్యనారాయణ రెడ్డి సివిల్ జడ్జిగా ఎంపికవడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన విజయం ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తి అని కొనియాడారు.

కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్స పేదలకు చేరువ కావాలి: ఎంపీ కావ్య



హనుమకొండ సిటీ, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి) :

హనుమకొండ సిటీ, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి): వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్స ఖర్చును తగ్గించాలని ఆమె సూచించారు. ఈ చికిత్సను పేద, మధ్యతరగతి ప్రజలకు చేరువ చేయాలని అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలో అపర్ణ ఈఎన్‌టీ హాస్పిటల్, అపర్ణ రాయ్ ఫౌండేషన్, ఏఓఐ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. 'సీఐ ఫ్రంటియర్స్-2026' సదస్సుకు ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె ప్రసంగంలో వైద్య ఖర్చుల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ప్రైవేటులో కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్సకు రూ.10-15 లక్షలు ఖర్చవుతోందని ఎంపీ తెలిపారు. ప్రభుత్వ రంగంలో ఈ చికిత్సకు రూ.6 లక్షల వరకు ఖర్చవుతోందని చెప్పారు. ఆర్థిక స్తోమత లేక ఏ చిన్నారీ వినికిడి అవకాశాన్ని కోల్పోకూడదని ఆమె ఆకాంక్షించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే తక్కువ ఖర్చుతో ప్రాణాలు కాపాడవచ్చని కావ్య పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు.

వరంగల్ పండ్ల మార్కెట్ వ్యాపారుల కష్టాలు ఇంకెన్నాళ్లు?



వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 14.

వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రభుత్వాలు మారుతున్నా పండ్ల మార్కెట్ వ్యాపారుల సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. శనివారం నగరంలోని పండ్ల మార్కెట్‌ను సందర్శించిన ఆయన, బీజేపీ నాయకులు, వ్యాపారులు, రైతులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వాలు మారుతున్నా వ్యాపారుల జీవితాల్లో మార్పు రావడం లేదని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాత పండ్ల మార్కెట్‌ను కూల్చి కొత్త మార్కెట్ నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేసిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పనులు పూర్తి చేయడంపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. హామీలతో ఓట్లు అడగడం కాకుండా చేతల్లో అభివృద్ధి చూపాలని డిమాండ్ చేశారు.

బూత్ స్థాయి నుంచే బీజేపీని బలోపేతం చేయాలి.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



విశేష ప్రతినిధి విశేష నివేదిక

పర్వతగిరిలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం ఉత్సాహంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని అన్నారు. గ్రామస్థాయి నుంచే పార్టీని మరింత పటిష్టం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు హర్యావత్ వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వర్ధాల వెంకటరమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొండేటి శ్రీధర్ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులందరికీ చేరాలన్నారు. గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు అండగా నిలవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆయన సూచించారు. ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ కార్యకర్తలు బాధ్యతతో పనిచేయాలన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నర్సంపేట వుదయం ప్రతినిధి నవంబర్ 14.

నర్సంపేటలోని సంజీవని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లో బాలల వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు ఈ వేడుకలు జరగనున్నాయి. బాలలకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, పౌష్టికాహారం, రక్షణ కల్పించాలని కలెక్టర్ సూచించారు. బాలల భవిష్యత్తే దేశ భవిష్యత్తని ఆమె అన్నారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఉమారాణి కూడా బాలల హక్కుల పరిరక్షణలో బాధ్యత వహించాలని అన్నారు. కలెక్టర్ చిన్నారులతో కలిసి కోకో, కబడ్డీ, వ్యాసరచన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలైన బాలలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

గ్రామసభ ప్రాముఖ్యతపై విద్యార్థుల అదరగొట్టే స్కిట్!



రాయపర్తి నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

రాయపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామసభ నిర్వహణపై ప్రదర్శించిన స్కిట్ అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో గ్రామసభ ప్రాముఖ్యతను, గ్రామ సమస్యల పరిష్కారంలో ప్రజల పాత్రను విద్యార్థులు తమ నటనతో కళ్లకు కట్టినట్లు చూపించారు. విద్యార్థులు ప్రజల భాగస్వామ్యం, ప్రజాప్రతినిధుల బాధ్యతలను వివరించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. ఈ స్కిట్‌లో సర్పంచ్ పాత్రలో మల్యాల లక్ష్మీ ప్రియ నటించారు. ఉపసర్పంచ్‌గా చిన్నాల రాజ్‌కుమార్ కనిపించారు. వార్డు సభ్యులుగా షాహిద్ పాషా, అశ్విని, అన్వేష్, ఆదర్శ్, కావ్య, నాజ్మిన్, తేజస్విని, లత, ఇర్ఫాన్, హర్షిత్ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. గ్రామ కార్యదర్శిగా శరత్ తదితర విద్యార్థులు అద్భుతంగా నటించారు. గ్రామసభలో జరిగే చర్చలు, ప్రజా సమస్యలపై తీర్మానాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులు సహజంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. విద్యార్థుల నటన గ్రామసభ పనితీరును స్పష్టంగా వివరించింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి, కార్యదర్శి యాకూబ్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



పర్వతగిరి , నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

పర్వతగిరి మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయుడు ఏ. వెంకటరమణారెడ్డి మాట్లాడారు. చదువుతో పాటు ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ బయటపడుతుందని ఆయన పేర్కొన్నారు. వారిలో సృజనాత్మకత అలవడుతుందని కూడా చెప్పారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ వేడుకలలో పాఠశాల చైర్ పర్సన్ నీరటి జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్ పర్సన్ నీరటి జ్యోతి వేడుకలలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, ఆఫీస్ సబార్డినేట్ కూడా వేడుకలలో పాల్గొన్నారు.

మైనారిటీ యువజన నాయకుడు షకీల్ భాయ్‌కు ఆదర్శ్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు..



వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (నవంబర్ 14)

తెల్లాపూర్ ప్రతినిధి నవంబర్ 14న మైనారిటీ యువజన నాయకుడు షకీల్ భాయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమం ఇది. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదర్శ్ రెడ్డి షకీల్ భాయ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేస్తూ రాజకీయ, సామాజిక రంగాల్లో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో భారతీనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు బూన్ పాల్గొన్నారు. బీఆర్ఎస్వీ సంగారెడ్డి జిల్లా మాజీ కోఆర్డినేటర్ చిన్న, మైనారిటీ మాజీ అధ్యక్షుడు అజీముద్దీన్ హాజరయ్యారు. బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, బాబా, జాకీర్, అహ్మద్ తదితరులు షకీల్ భాయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఝురాసంగం మండలంలో ఈ నెల 17న కొత్త పింఛన్ల పంపిణి కార్యక్రమం



ఝురాసంగం నవంబర్-14(వుదయం ప్రతి నిధి)

ఝురాసంగం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 17వ తేదీన మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అర్హులైన మొత్తం 586 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారుల వివరాల్లో దివ్యాంగులు 85 మంది, వితంతువులు 421 మంది, గీత కార్మికులు 4 మంది, ఒంటరి మహిళలు 76 మంది ఉన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలు హాజరుకానున్నారు.

మన ఊరు మన గుడి..



పరకాల నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

పరకాల పట్టణ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు సుమారు రెండు కిలోల వెండి ఆభరణాలను సమర్పించనున్నారు. ఈ ఆభరణాలు సుమారు రూ.5 లక్షల విలువైనవని సమాచారం. ఈ కార్తీక మాసం నవంబర్ 16వ తేదీ సోమవారం స్వామివారికి భక్తిశ్రద్ధలతో బహుకరించనున్నారు. మేకల సంధ్యారాణి శ్రీధర్ దంపతులు స్వామివారి అలంకరణ కోసం సుమారు ఒక కిలో వెండి ఆభరణాలను సమర్పించనున్నారు. ఎర్రబెల్లి మంజులభాస్కర్ రెడ్డి దంపతులు కూడా మరో కిలో వెండి ఆభరణాలను కృతజ్ఞతగా అందించనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకుని దాతలను ప్రోత్సహించారు. వంశానుగత అర్చకుల సమక్షంలో ఈ ఆభరణాలను స్వామివారికి సమర్పించనున్నారు.

నేడు చింత నెక్కొండకు మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) రాక

పర్వతగిరి , నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

వుదయం న్యూస్

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి నేడు (నవంబర్ 15) తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క రానున్నారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. రెడ్లవాడ వరకు రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన జరగనుంది. అంబేద్కర్ సెంటర్ నుంచి శివాలయం వరకు రహదారి విస్తరణకు కూడా శంకుస్థాపన ఉంటుంది. శివాలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కూడా జరగనుంది. ఇందిరమ్మ పింఛన్ల పంపిణీ కూడా కార్యక్రమంలో భాగమే. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎమ్ఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కూడా జరగనుంది. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎంపీ డాక్టర్ కడియం కావ్య హాజరుకానున్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, అధికారులు పరిశీలించారు. అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు.

వింటేజ్ కాఫీ కంపెనీతో గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి



వెల్దండ నవంబర్ 14 (వుదయం)

రాచూర్ గ్రామ వార్డు సభ్యుడు రమేష్ ముదిరాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. వెల్దండ మండలం రాచూర్ గ్రామ శివారులో వింటేజ్ కాఫీ కంపెనీ ఏర్పాటైంది. ఈ కంపెనీ ద్వారా పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోందని ఆయన తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో రమేష్ ఈ వివరాలు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పరిశ్రమలు ఏర్పడితే నిరుద్యోగ సమస్య తీరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కంపెనీ వల్ల సుమారు 100 కుటుంబాలకు జీవనోపాధి కలుగుతుందని చెప్పారు. కంపెనీపై కొందరు కావాలని అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. మిషన్ భగీరథ నిబంధనల ప్రకారమే కంపెనీకి నీటి సరఫరా జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు సహకారం అందితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. గ్రామ యువతతో కలిసి త్వరలో కంపెనీ ఎండీని కలుస్తామని రమేష్ తెలిపారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరతామని చెప్పారు. వింటేజ్ కాఫీ కంపెనీకి అండగా ఉంటామని ఆయన ప్రకటించారు.

"వందకి వంద మార్కులు రావడం గొప్పకాదు. వంద మందికి సహాయం చెయ్యడం గొప్పతనం"



పర్వతగిరి నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

పర్వతగిరి మండలం జమాల్ పురం / సోమారం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తివంతమైన ప్రసంగం చేశారు. సర్పంచ్ నవంబర్ 14న చాచా నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. సర్పంచ్ తాను చిన్నప్పుడు ఒక పలక, బలపంతో చదువుకున్నానని చెప్పారు. ఐదు కిలోమీటర్లు పర్వతగిరికి నడిచి వెళ్లి స్కూల్‌కి వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. ఈ రోజు ప్రభుత్వం పుస్తకాలు, డ్రెస్సులు, షూ అన్నీ సమకూరుస్తోందని తెలిపారు. సర్పంచ్ పిల్లలకు మూడు సూత్రాలు సూచించారు. పెద్ద కలలు కనాలని, వందకి వంద మార్కులు కాదు, వంద మందికి సహాయం చేయడమే గొప్పతనమని చెప్పారు.

నెహ్రూ జయంతి సందర్భంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



పరకాల నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

పరకాల నవంబర్ 14 (వుదయం ప్రతినిధి): భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పరకాల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, సమన్వయ కమిటీ సభ్యులు కూడా హాజరయ్యారు. వార్డు అధ్యక్షులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు నెహ్రూ సేవలను స్మరించుకున్నారు. ఈ నివాళి కార్యక్రమం పరకాలలో కాంగ్రెస్ శ్రేణుల ఐక్యతను చాటింది.

తండా బిడ్డ జాతీయ గర్జన.. ధూపతండా ముద్దుబిడ్డ సింధుకు ఘన సన్మానం!



పర్వతగిరి , నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

పర్వతగిరి, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి): మారుమూల గిరిజన తండా నుంచి ఎదిగిన డిఎస్. సింధును ఆమె స్వగ్రామం ధూపతండాలో ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన సింధు స్వగ్రామానికి వచ్చారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ మనోజ్ గౌడ్ ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అన్నారం షరీఫ్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న సింధు విజయంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆమె విజయం తండాకు గర్వకారణమని మనోజ్ గౌడ్ అన్నారు. పాఠశాల పీఈటీ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే సింధు కఠిన సాధన చేసి ఈ ఘనత సాధించారని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై కూడా దేశానికి పతకాలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

నేటి బాలలే రేపటి పౌరులు- పిల్లల భవిష్యత్తే గ్రామ భవిష్యత్తు



ఖానాపురం, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

ఖానాపురంలో నవంబర్ 14న గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బాల గ్రామ సభ జరిగింది. పిల్లల సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని గ్రామ సర్పంచ్ తెలిపారు. ఈ సభకు మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ కూడా హాజరయ్యారు. సభలో పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, హక్కులు, భవిష్యత్తు అభివృద్ధి అంశాలపై చర్చ జరిగింది. బడి మానేసిన పిల్లలు, బాల కార్మికులు, బాల్య వివాహాల నిర్మూలన అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. పోషకాహార లోపం గురించి కూడా చర్చించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆట స్థలాలు, మొబైల్ ఫోన్ వినియోగం, మత్తుపదార్థాల నివారణపై చర్చ కొనసాగింది. ఈ సమస్యల నిర్మూలనకు కృషి చేయాలని నిర్ణయించారు. పిల్లలు తమ సమస్యలను నిర్భయంగా చెప్పుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడమే బాల గ్రామ సభ ఉద్దేశమని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి!



రాయపర్తి, నవంబర్ 14 (వుదయం ప్రతినిధి):

